కుటుంబ సభ్యులు పరామర్శించిన తులసి రెడ్డి

విశాలాంధ్ర - కమలాపురం : మండల పరిధిలోని సి రాజుపాలెం గ్రామం లో తెలుగుదేశం పార్టీ కి చెందిన సీనియర్ నాయకుడు సుధా అంకిరెడ్డి మృతి చెందారు ఈ విషయం అందరికీ తెలిసిందే. అయితే కాంగ్రెస్ పార్టీ మాజీ రాజ్యసభ సభ్యుడు తులసి రెడ్డి సుధా అంకిరెడ్డి కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు కుటుంబ సభ్యులను మాజీ రాజ్యసభ సభ్యుడు సుధా అంకిరెడ్డి సోదరులను కుమారులను అంకిరెడ్డి మరణం పై ఆయన అడిగి తెలుసుకున్నారు కడప జిల్లా తెలుగు దేశం పార్టీ చెందిన జిల్లా ఉపాధ్యక్షుడు సుధా అంకిరెడ్డి రాజకీయంగానే కాకుండా మిత్రబృందంతో కలివిడిగా అందరితో ఉండేవాడని ఆయన మరణం చాలా బాధాకర విషయం అని అన్నారు. అంతకుముందే సుధా అంకిరెడ్డి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో అమర్ ఉత్తన్న వినయ్ బాలు సుధా రాజారెడ్డి అంకిరెడ్డి సోదరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి

విశాలాంధ్ర-వేంపల్లె: వేంపల్లెలో సర్దార్ భగత్ సింగ్‌కు ఆమ్‌ఆద్మీపార్టీ నాయకులు దాదాపీర్, గౌస్, పీరుబాష, సిరాజ్, తాజ్‌లు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసిన ఘననివాళులు అర్పించారు. భగత్‌సింగ్ ధైర్య సాహసాలు, దేశానికి అందిచిన సేవలను వారు కొనియాడారు.

రూ. 8లక్షలు పలికిన గణేష్ లడ్డు

విశాలాంధ్ర- పులివెందుల: పులివెందుల పట్టణం మైత్రీలే ఔట్‌లో వినా యక చవితి పర్వది నంసందర్భంగా గురు వారం నిర్వహించిన గణేష్ లడ్డు వేలం పాటలో రూ. 8 లక్షలు పలికింది. వినాయక చవితి పండుగ సందర్భంగా ఈ నెల 19వ తేదీన ఇక్కడ వినాయక ప్రతిమను నెలకొల్పారు. 9రోజుల పాటు పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ లడ్డు కోసం గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో శ్రీరాములు యాదవ్ రూ. 8లక్షలతో గణేష్ లడ్డును దక్కించుకున్నారు. అనంతరం నిమజ్జన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టరు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాబుతో నేను..

కరపత్రాల పంపిణీపై భూపేష్ శ్రేణులకు దిశానిర్దేశం

విశాలాంధ్ర- యర్రగుంట్ల : తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టు, రిమాండ్ నేపథ్యంలో ఆ పార్టీ జమ్మలమడుగు అసెంబ్లీ నియోజక వర్గ బాధ్యులు చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి సారథ్యంలో నిరసనల పర్వం కొనసాగుతున్న విషయం విదితమే. గురువా రం ఎర్రగుంట్లలోని పార్టీ కార్యాలయం చేరుకున్న భూపేష్ శ్రేణులతో భేటీ అయ్యారు. బాబుతో నేను కరపత్రాల పంపిణీపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎందుకీ అరెస్టు..చంద్రబాబు చేసిన తప్పేంటి ? నైపుణ్య శిక్షణా కేంద్రాలతో మన బిడ్డలకు ఉద్యోగాలు కల్పించడం నేరమా ? కుటుంబం కన్నా ప్రజలే ముఖ్యం అంటూ పగలు, రాత్రి కష్టపడడం తప్పా ? ప్రజా సమస్యల కోసం రోడ్డెక్కి ప్రభుత్వాన్ని నిలదీయడం అపరాధమా ? అవినీతిపై జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం పాపమా ? సారాంశంతో కూడిన కరపత్రాలను విస్తృతంగా పంపిణీ చేయాలని భూపేష్ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల బాధ్యులు మాలేపాడు మోహన్‌రెడ్డితో పాటు ఎస్.సంజీవరెడ్డి, పి.రమేష్‌రెడ్డి, ఎలకల బయ్యప ్రరెడ్డి, కోడూరు శివశంకర్‌రెడ్డి, అబ్దుల్, గంగాధర్, కొండారెడ్డి, సుంకర నాగేశ్వరరావు, పులికొండ, శ్రీనివాసులు, చాంద్‌బాష, దానం, రామ మోహన్‌రెడ్డి, బీఎం బాష, నాగభూషణ్‌రెడ్డి, నరసింహారెడ్డి, పాల్గొన్నారు.

పలువురికి భూపేష్ పరామర్శ: వివిధ అనారోగ్య కారణాలతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న యర్రగుంట్లకు చెందిన సురేష్, వీరి మీసాలకృష్ణ, చిలంకూరుకు చెందిన రవిని భూపేష్ పరామర్శించారు. సురేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా మీసాల కృష్ణ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న భూపేష్ వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

విశాలాంధ్ర- పోరుమామిళ్ల : పారిశుధ్య కార్మికులు ప్రజలకు అందిస్తున్న సేవలు ఎనలేనివని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని రంగసముద్రం పంచాయతీ పారిశుధ్య కార్మికులను బ్లెస్డ్ బ్రయాన్ ఆశ్రమంలో స్వచ్ఛహి సేవలో భాగంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్యం మెరుగుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. రంగసముద్రం పంచాయతీలో సర్పంచ్ చిత్తా రవిప్రకాష్ రెడ్డి, కార్మికులు, సిబ్బంది స్వచ్ఛత పై ప్రత్యేక దృష్టి సారించి పని చేస్తున్నారని అభినందించారు. విజయవాడలో ఈ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, చెన్ను రాజశేఖర్, సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కల్లూరు రమణారెడ్డి, డీఎల్‌పీఓ రమణారెడ్డి, ఎంపిడిఓ వర ప్రసాద్‌రావు, కార్యదర్శి రాజీవ్ రెడ్డి, ఎంపీటీసీలు కలవకురి రమణ, జల్లి చంద్రాయుడు, ఉప సర్పంచ్ రుద్రవరం ప్రసాద్, మాజీ సర్పంచ్ మాల కొండయ్య, పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు: అంతకు మునుపు రెడ్డి నగర్‌లో నూతనంగా నిర్మించిన రామాలయంలో డిపిఓ ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనతో పాటు డీఎల్‌పీఓ రమణారెడ్డి, టేకుర్ పేట సర్పంచ్ రమణారెడ్డిలను శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. అనంతరం రంగ సముద్రం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ పార్కు ఏర్పాటు చేసి ఆహ్లాదకరంగా మార్చడంతో సర్పంచ్, సిబ్బందిని అభినందించారు.

భగత్ సింగ్ ఆశయ సాధనకు యువత ఉద్యమించాలి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-కడప రూరల్ : యువత భగత సింగ్ ఆలోచన విధానాన్ని అధ్యయన మంచేసి ఆయన ఆశయ సాధనకు ఉద్యమించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బి. దస్తగిరి, నిహార్ స్కిల్ సెంటర్ ప్రిన్సిపాల్ సుబ్బారావు పిలుపునిచ్చారు. గురువారం కడపలోని నిహార్ స్కిల్ సెంటర్ లో భగత్ సింగ్ 116 వ జయంతి ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్ చిన్న వయసులోనే దేశంకోసం పోరాటం చేసాడని, బ్రిటిష్ వారితో పోరాటం చేయడం తోపాటు, దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాస్త్రియమైన ఆలోచన విధానని తెలిపాదన్నారు. సామ్యవాదం, కమ్యూనిజం, శాస్త్రీయ సోషలిజం లక్ష్యాలతో అతి చిన్న వయస్సులో పోరాటం చేశారన్నారు. దేశంలో ప్రజల రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితి గతులపై అధ్యయనం చేసి ఉద్యమించాడన్నారు. ఇది నేటి యువతకు ఎంతో ఆదర్శం అని అన్నారు. ప్రస్తుతం దేశంలో రాష్ట్రంలో యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నాదని, చదువుకున్న చదువుకు సరైన ఉద్యోగాలు దొరకని పరిస్థితి అని,ప్రభుత్వాలు ఆవిధమైన విధానలు అవాలంభిచడం వలన ప్రస్తుతం పరిస్థితి దేశంలో రాష్ట్రంలో నెలకొని ఉందన్నారు, ఇప్పటికైనా యువత మేల్కొని భగత్ సింగ్ ఆలోచన విధానం తో, పోరాటం స్ఫూర్తి తో ముందుకు వచ్చి ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమం లో ఏ.ఐ.వై.ఎఫ్ నగర కార్యదర్శి మైనద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు చైతన్య పాల్గొన్నారు.

ఇంటి వద్దనే మెడికల్ స్క్రీనింగ్ నిర్వహణ

విశాలాంధ్ర- పులివెందుల: పులివెందుల పట్టణం లో శుక్రవారం నుంచి ఇంటి వద్దనే మెడికల్ స్క్రీనింగ్ నిర్వహణ ఉంటుం దని వైసీపీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్‌లు తెలిపారు. పట్టణంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పరిధిలో ప్రతి ఇంటికి ఉచిత వైద్యపరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, ఉచితంగా మందులు అందజేయడమే జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. సీహెచ్ఓ, ఏఎన్ఎమ్, వాలంటీర్ ముగ్గురు కలిసి ఇంటింటా మూడు రౌండ్లు తిరిగి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తారన్నారు. సుమారు ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సమాచారం కూడా సేకరిస్తారన్నారు. క్యాంపు తేదీ వివరాలను వెల్లడిస్తారన్నారు. నలుగురు వైద్యుల ఆధ్వర్యంలో వార్డు సచివాలయ పరిధిలో వైద్యపరిక్షలు నిర్వహిస్తాంన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

లక్ష అకాడమీ విద్యార్థులు విజయం

విశాలాంధ్ర -కడప : అగ్ని వీర్ ఆర్మీ ఉద్యోగాల నందు 16 మంది లక్ష్యా అకాడమీ విద్యార్థులు విజయం సాధించారు. ఎస్. ఆజామ్ జి. మారుతి కుమార్ రెడ్డి, ఎస్. ఓబులేసు, డి. మల్లికార్జున, బి. కాశీం, ఎం.వెంకట సాయి చరణ్, ఆర్. శ్రీనాథరెడ్డి, డి. సుబ్బరాయుడు, పి. తాగూర్ భాష, ఏ. అశోక్, జె. వంశీ,. ఎస్. సాయికుమార్, ఎం. బాలాజీ, ఎన్. ఆకాష్, వి. వెంకటరమణ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంలో కృషిచేసారు. లక్ష్యా అకాడమీ అధ్యాపక బృందానికి స్టాఫ్ కు డైరెక్టర్ బసిరెడ్డి పోలిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వారు గురువారం విశాలాంధ్ర తో మాట్లాడుతూ సిఆర్పిఎఫ్ నందు 1,29929 ఉద్యోగాలు మరియు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పిఎఫ్) నందు ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని, త్వరలో నోటిఫికేషన్ జారీ చేయబోతున్నారని కేంద్ర ప్రభుత్వం తెలియజేయడమైనది. అభ్యర్థులు గమనించగలరు సిఆర్పిఎఫ్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ మరియు అగ్ని వీర్ ఆర్మీ నందు ఉద్యోగానికి లక్ష అకాడమీ నందు అక్టోబర్ 4. 2023 నుండి క్లాసులు ప్రారంభమగునని తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాల్సి నదిగ కోరారు. మరిన్ని వివరాలకు 9959952048 నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

సత్యసాయి జిల్లా వాసి మదనపల్లిలో మృతి..

విశాలాంధ్ర -మదనపల్లి: సత్యసాయి జిల్లా వాసి మదనపల్లిలో మృతి చెందిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. రెండవ పట్టణ ఏఎస్ఐ రమణ కథనం మేరకు.. సత్యసాయి జిల్లా ఓడిస్ మండలం బుచ్చిరాజు పల్లికి చెందిన వలసపల్లి బయప్ప కొడుకు బైరిశెట్టి (70) ఐదేళ్ల క్రితం ఇల్లు వదిలి సత్యసాయి జిల్లా నుంచి మదనపల్లెకు వచ్చి స్థిరపడ్డారు. జీవనం సాగిస్తున్న బైరిశెట్టి బుధవారం అర్ధరాత్రి స్థానిక వారపు సంతలో ఉన్న ఓ హోటల్ దగ్గరకు వచ్చి అనారోగ్యం కారణంగా తను ఉంటున్న ఇంటికి వెళ్లలేని స్థితిలో అక్కడే ఉండి పోయాడు. గురువారం ఉదయం చలికి అతను చనిపోయి ఉండడాన్ని స్థానికులు గుర్తించి సుమారు 55 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి సంతలోని ఓ హోటల్ వద్ద అనుమానాస్పద స్థితిలో చనిపోయాడని టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహం వద్దకు చేరుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం మదనపల్లె ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. జేబులో ఉన్న సెల్ ఫోన్ నెంబర్ల ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందించడంతో మృదని ఆచూకీ లభించింది. కుటుంబీకులు సాయంత్రం పోలీస్ స్టేషన్ కి రాగానే వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు ఏఎస్సై రమణ, హెడ్ కానిస్టేబుల్ రాము మూర్తి తెలిపారు.

గ్రామాన్ని సందర్శించిన అధికారులు

పోలీసు, రెవెన్యూ శాఖలు క్షేత్రస్థాయి విచారణ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : తిప్పలూరు గ్రామ హరిజనుల నిరసన అనంతరం జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, మండల తాహసీల్దార్ నాగేశ్వరరావు, ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్యతో పాటు ఎస్ఐలు గ్రామాన్ని చేరుకొని అక్కడి పరిస్థితిపై విచారించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు అధికారుల ఎదుట తమ వాదనను వినిపించారు. గణేష్ ఉత్సవాల నేపథ్యంలో పెద్ద ఎత్తున డీజే సౌండ్ సిస్టమ్, బాణాసంచా వినియోగం కారణాల రీత్యా తమకు కలుగుతున్న అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరగా కార్యక్రమాన్ని ముగించాలని కోరామే తప్ప మరో ఆలోచన తమకు లేదని స్పష్టం చేశారు. బాణాసంచా పేలుళ్లతో గడ్డివాములు దగ్ధమయ్యే ప్రమాదం ఉందని చెప్పామన్నారు. డీజే సిస్టమ్ సౌండ్‌తో పశువులు బెదిరిపోయాయని అధికారులకు వివరించారు. అధికారులు గ్రామంలోని అన్ని సామాజిక వర్గీయులతో చర్చించి పరిస్థితిని శాంతింపచేశారు. అనంతరం అధికారులు గ్రామానికి చెందిన పలువురిని పోలీసుస్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామంలో శాంతియుత వాతావరణానికి భంగం కలిగించరాదని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే వరద ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా మాజీ ఎమ్మెల్యే వరద రాజుల రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. గురువారం స్థానిక శివాలయం సర్కిల్‌లో మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, యువనాయకులు కొండారెడ్డి సమక్షంలో 300మందితో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఈ దీక్షలలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ స్కిల్ డెవపల్‌మెంట్ కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసు బనాయించారని, ఇది దారుణం అన్నారు. నేడు దేశ విదేశాలలో ఉద్యోగాలు చేస్తున్నారంటే చంద్రబాబు నాయుడు కృషి ఎంతో ఉందని అన్నారు. యువనాయకులు నంద్యాల కొండారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ దారుణం అన్నారు. చంద్రబాబు అరెస్ట్ తో రాష్ట్ర వ్యాప్తంగా ఆయనకు ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు మద్ద తు పలుకుతున్నారన్నారు. ఈ కార్యరకమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చుల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, ఘంటసాల వెంకటేశ్వర్లు, సాంబశివుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకటారాయుళ్లు అరెస్ట్

విశాలాంధ్ర-గాలివీడు: పేకాట స్థావ రంపై దాడి చేసి 5 మంది పేకటా రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ. 3450 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకట శివ కుమా ర్ తెలిపారు. గురువారం మండ లంలోని అరవీడు గ్రామం గాండ్లపల్లి చెట్ల క్రింద పేకాట ఆడుతిన్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలం లో క్రికెట్ బెట్టింగ్, కోడిపందాలు, జూదంపై నిఘా ఉంచామన్నారు. ఆసాం ఘక కార్యక్రమాలకు పాల్పడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి 30న చలో విజయవాడ

విశాలాంధ్ర - మైదుకూరు : విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30న జరగనున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం చలో విజయవాడ పోస్టర్స్ మైదుకూరు పట్టణంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని అన్ని జిల్లా కేంద్రాలలో చలో కలెక్టరేట్ లు నిర్మావహిస్తే రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు చేత విద్యార్థి సంఘ నాయకులను, విద్యార్థులను బలవంతంగా అరెస్ట్ చేసి అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. సమస్యల పరిస్కారం కోసం విద్యార్థులు రోడ్డెక్కితే సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూడటం దారుణమన్నారు. సంక్షేమ హస్టల్ విద్యార్థులకు నేటికి గత 6,7 నెలల మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. పెరిగిన ధరలకు అనుగునంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెచమని అడిగితే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండా విద్యార్థులు చదువులు ఎలా కొనసాగించాలని వారు ప్రశ్నించారు. విద్యాసంవత్సరం ప్రారంభం అయి 4 నెలలు అవుతున్న నాదు నేదు పనులు ఇంకా పూర్తి కాకా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. పాఠశాల విలీనం పేరుతో ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని వారు ఆరోపించారు. ఎన్నికల ముందు విద్యార్థులకు అండగా ఉంటానని చెప్పిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పూర్తిగా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని వారు అన్నారు. ప్రభుత్వ విద్యారంగ బలోపేతం కోసం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునేందుకు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్.ఎఫ్.ఐ ఈనెల 30న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమంలో విద్యార్థులు వేల సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగ చరణ్, హరి నాయక్, చందు, శ్రీనివాసుల నాయక్, కాశీ తదితరులు పాల్గొన్నారు.

జీ తెలుగు అందిస్తోన్న సరికొత్త సీరియల్ 'సీతే రాముడి కట్నం

అక్టోబర్ 02 నుంచి సోమవారం నుండి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 12:30 గంటలకు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ఆసక్తికరమైన మలుపులు, అదిరిపోయే ట్విస్ట్ లతో సాగే సీరియల్స్ ను అందిస్తున్న జీ తెలుగు మరో ఆసక్తికరమైన అంశంతో సాగే సీరియల్ను తన అభిమాన వీక్షకులకు అందించేందుకు సిద్ధమైంది. ఆసక్తికరమైన కథ, కథనంతో అత్తాకోడళ్ల మధ్య సాగే సరికొత్త సీరియల్ 'సీతే రాముడి కట్నం'. ఈ సీరియల్లో అత్తాకోడళ్ల మధ్యనున్న ప్రత్యేకమైన బంధాన్ని కొత్తకోణంలో చూపించను న్నారు. అనుకోకుండా ముడిపడే సీతారాముల బంధం, సహజమైన అందంతో ఆత్మసంతృప్తికి ప్రాధాన్యమిచ్చే కోడలు, ఆకర్షించే బాహ్యసౌందర్యమే ప్రధానమైనదని భావించే అత్త మధ్య సాగే ఈ కథలోని మలుపులు సీరియల్ని మరింత ఆసక్తికరంగా మారుస్తాయి. ఈ సీరియల్ కథ నిరాడంబరత, నిష్కల్మషమైన మనసుతో నిజాయితీగా జీవించే సీత అనే సాధారణ అమ్మాయి చుట్టూ తిరుగుతుంది. సీత ఫ్యాషన్పై అభిరుచి, మంచి నైపుణ్యంగ ల టైలర్ కూడా. నిజాయితీపరుడైన రామ్ పోలీస్ కావాలని కలలు కంటూ తన తల్లి ఆదేశం మేరకు తమ కుటుంబపరమైన వ్యాపారాన్ని చూసుకుంటూ ఉంటాడు. మహాలక్ష్మికి ఎన్నో వ్యాపారాలున్న కాస్మెటిక్ కంపెనీ అంటే చాలా ఇష్టం. అదానికే మొదటి ప్రాధాన్యం ఇచ్చే వ్యక్తి మహాలక్ష్మి(రామ్ తల్లి). తానెంతగానో ప్రేమించే తన కొడుకు భవిష్యత్తుపై కలలు కంటుంది. అందమైన అమ్మాయిని ఇచ్చి కొడుక్కి పెళ్లి చేయాలని ఆశపడుతుంది. అందంగా లేని దేన్నైనా ద్వేషించే మహాలక్ష్మి తనకు ఎంతమాత్రం నచ్చని సీతను కోడలుగా పొందుతుంది. మరి సీత తన అత్త మహాలక్ష్మిని ఎలా మెప్పిస్తుంది? అనేది తెలుసుకోవాలంటే జీ తెలుగులో ప్రసారం కానున్న 'సీతే రాముడి కట్నం' సీరియల్ తప్పకుండా చూడాల్సిందే..ఈ సీరియల్లో సీతగా వైష్ణ వి. రామ్ నమీర్ నటిస్తున్నారు. మహాలక్ష్మిగా మంజుల పరిటాల నటించడం విశేషం. ఇక, సీత తండ్రి శివకృష్ణ పాత్రలో ప్రముఖ నటుడు ఇంటూరి వాసు కనిపించనున్నారు. సీతే రాముడి కట్నం సీరియల్ ప్రారంభంతో మిగతా సీరియల్స్ ప్రసార సమయాల్లో స్వల్ప మార్పులు ఉంటాయి.

ప్రార్థనా మందిరాలతో మనశ్శాంతి

ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష

విశాలాంధ్ర- ఒంటిమిట్ట : ప్రార్థనా మందిరాలైన మసీదు, దేవాలయం, చర్చి వంటి వాటిలో మనిషి దైవ ప్రార్థన చేసుకుంటే మనశ్శాంతి, పవిత్రత చేకూరుతుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మైనార్టీ శాఖ మంత్రి ఎస్‌బి అంజద్‌బాష అన్నారు. మిలాద్ ఉన్ నబీ పండుగ మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు రోజు గురువారం నాడు నూతనంగా నిర్మించిన జామియా మసీద్ ప్రారంభోత్సవానికి మైనార్టీ మినిస్టర్ మరియు డిప్యూటీ సీఎం అమ్జద్ భాష హాజరయ్యారు. ఆయన రాకతో స్పెషల్-1 కాంట్రాక్టర్ ఎస్.వి.రమణ, రాష్ట్ర గిడ్డంగుల డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఒంటిమిట్ట మండల టీడీపీ అధ్యక్షులు గజ్జల నరసింహారెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి బొబ్బిలిరాయుడు, ఒంటిమిట్ట మండల బీసీసెల్ అధ్యక్షుడు అయ్యవారయ్య, రాజంపేట పార్లమెంటు బీసీసెల్ అధ్యక్షులు టిపి రమణ, ఎస్సీసెల్ నాయకులు కత్తి చంద్ర, రాజంపేట అసెంబ్లీ రైతు ఉపాధ్యక్షులు తుమ్మలకుంట ఈశ్వరయ్య, ఒంటిమిట్ట సర్పంచ్ కత్తి నరసింహులు, ఎస్‌సి రమణారెడ్డి, చేలూరి శేషారెడ్డి, ఆకేపాటి శివారెడ్డి, మేకపాటి నందకిశోర్‌రెడ్డి, జాబియా మసీదు ముత్తవల్లి షేక్ హబీబుల్లా, జామియా మసీదు కమిటీ సభ్యులు డీలర్ మస్తాన్, డాక్టర్ జిలాని భాష, షేక్ అజ్మతుల్లా, గౌరవంగా పూల బొకే ఇచ్చి ఆహ్వానం పలికారు. అనంతరం మత గురువులు అబ్దుల్ రెహమాన్ బోగ్గది, మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర బయాన్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జామియా ఇస్లామిక్ నూరుల్లా ట్రస్ట్ మదర్సా నిర్వాహకులు క్వారీ అబ్దుల్ సుభహాన్ మరియు మౌలా నాలు షహేన్షా జకావుద్దీన్, నిజాముద్దీన్ బుకారి, అబ్దుల్ హైదర్ అలీ, మౌలానా మహబూబ్ బాషా జామియా మసీదు ముత్తవల్లి షేక్ హబీబుల్లా, జామియా మసీదు కమిటీ నిర్వాహకులు డీలర్ మస్తాన్, డాక్టర్ జిలాని భాష,షేక్ అమానుల్లా, మహమ్మద్ రఫీ,షేక్ అజమతుల్లా, సయ్యద్ జాకీర్ హుస్సేన్, సత్తార్, తాజుద్దీన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

నందలూరులో మిలాద్ ఉన్ నబీ

విశాలాంధ్ర- నందలూరు :: మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా జరుపుకునే పండుగ మిలాద్ - ఉన్ - నబీ ను ప్రతి సంవత్సరం లాగ నందలూరు రైల్వే కాలనీలోని హజరత్ ఖాదర్ వల్లి దర్గా సమీపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ చైర్మన్ కమాల్ భాష మాట్లాడుతూ జిల్లా వక్స్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి అమీర్, మండల కో ఆప్షన్ సభ్యులు కలిమ్ అధ్వర్యంలో గొప్ప అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిం దని ఈ సందర్భంగా తెలిపారు. విచ్చేసిన భక్తులకు, ప్రజలకు అన్నప్రసదనం వితరణ చేయడం జరిగింది. అనంతరం నాగిరెడ్డి పల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్య నారాయణను శాలువతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముస్లిం, హిందూ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చమర్తి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర - రాజంపేట: రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకోవడానికే ప్రతిపక్ష నేతలను అనిచివేస్తూ అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం, ఇబ్బందులకు గురి చేస్తూ అనిచివేతకు గురిచేస్తోందని టిడిపి రాజంపేట నియోజకవర్గ సీనియర్ నాయకులు చమర్తి జగన్ రాజు ఆరోపించారు. గురువారం రాజంపేట మండలం గుండ్లూరు శివాలయం వద్ద ఆయన టిడిపి శ్రేణులతో కలిసి చంద్రబాబు నాయుడు త్వరగా విడుదల కావాలంటూ 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన టిడిపి శ్రేణులు, ప్రజలతో కలిసి గుండ్లూరు గ్రామంలో టిడిపి కార్యకర్తలు, నాయకులు, ప్రజలతో కలిసి చంద్రబాబు నాయుడు గారి అక్రమ అరెస్ట్ కు నిరసన గా అభివృద్ధి చేయకు, అభివృద్ధి చూడకు, అభివృద్ధి అడుగకు లేకపోతే జైలు కు పంపుతాం అంటూ ప్లకార్డులు చేతబట్టి కోతి చిత్రాలను మొహానికి తగిలించుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రాజన్న భోజనంలో అన్నం వడ్డించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: పట్టణంలోని కొర్రపాడు రోడ్డులో గల రాచమల్లు వారి రాజన్న భోజనంలో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పాల్గొని ప్రజలకు స్వయంగా భోజనం వడ్డించారు. పేదలను కడుపునింపడమే తన లక్ష్యం అని, రాజన్న భోజనంలో ప్రజలకు రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసిఎస్ కో-ఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుల్‌రెడ్డి, వైకాపా నాయకు డు గౌతమ్‌రెడ్డి, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ప్రపంచ టూరిజం దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడలో జరిగిన కార్యాక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్, ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రాఫిక్ కౌన్సిల్ సహకారంతో నిర్వహించిన ఫోటో ఎగ్జిబిషన్ కార్యక్రమంలో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఫైనల్ ఇయర్ ఫోటోగ్రఫీ విభాగ విద్యార్థులకు బంగారు పతకాలు మరియు ప్రతిభ పురస్కారాలు పొందారు. ఈ పతకాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మైనార్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ శ్రీ ఇంతియాజ్ అహ్మద్ గారు, చేతులమీదుగా అందుకున్నారు. పతకాలు పొందిన కృష్ణారెడ్డి, తేజశ్విని యూనివర్సిటీ వైస్ ఛాన్స లర్ ఆచార్య బి.అంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఈ.సీ. సురేంద్రనాథ్ రెడ్డి ఇరువురిని అభినందించారు. ఫోటోగ్రాఫర్ కృష్ణారెడ్డి తీసిన చిత్రము కర్నులు జిల్లా దేవరగట్టులో దసర పండుగ రోజు జరిగే బన్ని ఉత్సవ చిత్రానికిగాను అలాగే మరొక ఫోటోగ్రాఫర్ తేజస్విని కడప జిల్లా గండికోటలోని మీర్జా మసీదు చిత్రానికిగాను ఈ పతకాలు పొందారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా

బాబు కోసం టీడీపీ వినూత్న శైలిలో నిరసన ప్రదర్శన

విశాలాంధ్ర-పులివెందుల: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కోసం పులివెందుల పట్టణంలో ఆ పార్టీ శ్రేణులు వినూత్నశైలిలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. గుండు, అరగుండులతో ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేదర రవికుమార్ మరొకరు కలిసి నిరసన వ్యక్తంచేశారు. స్కిల్ స్కామ్‌లో ఎలాంటి ఆధారాలు లేకపోయినా చంద్రబాబును అక్రమ అరెస్టును నిరిస్తూ పులివెందుల పట్టణంలో టీడీపీ ఇన్‌చార్జి బిటెక్ రవి ఆధ్వర్యంలో రిలేదీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ జగన్‌కు పోయేగాలం దాపురించిందన్నారు. కేవలం కక్షపూరిత రాజకీయాలతోనే చంద్రబాబును అరెస్టు చేయించి శునకానందం పొందుతున్నారని విమర్శించారు. ఇలాంటి అక్రమ కేసులు కోర్టులో నిలవడవన్నారు. ధర్మమే జయిస్తుందని వారు వెల్లడించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ పొరుగు రాష్ట్ర కర్నాటక, దేశ విదేశాలల్లో సైతం నిరసనలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఎందుకు కొరివితో తలగోక్కున్నానా అంటూ సీఎం జగన్, వైసీపీ మంత్రులు తలలుపట్టుకుంటున్నారన్నారు. చేసిన పాపాలు ఊరికేపోవని, రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు పట్టం ఖాయమని వారు తేల్చిచెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి, నాయకులు మద్దూరు వెంకటరామిరెడ్డి, తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, మాబాషా, అక్కులుగారి విజయ్, నల్లగారి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో వేదాస్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర - వల్లూరు : ఈనెల 21,22, 23వ తేదీ జరిగిన గుంటూరు స్పోర్ట్స్ మీట్లో వేదాస్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయికి ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ ధర్మదీరాజ్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు ఎస్. మోహన్ రన్నింగ్ లో సెకండ్ ప్లేస్ గెలవగా, ఎన్. సాయి పుష్పాష్ రన్నింగ్ లో థర్డ్ ప్లేస్ లో వచ్చాడు. బి.తేజేశ్వర్ రెడ్డి లాంగ్ జంప్ ఫస్ట్ ప్లేస్ గెలిచాడు. ఈ సందర్భంగా వేద స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాల చైర్మన్ శివరామిరెడ్డి ,వైస్ చైర్మన్ దిలీప్ రెడ్డి , కరస్పాండెంట్ దినేష్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు విద్యార్థులను అభినందించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - కమలాపురం : నేడు మండల సర్వ సభ సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారిని ఎస్ జ్యోతి గురువారం ఓ ప్రకటన తెలియజేస్తూ స్థానిక మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణంలో సభ సమావేశం భవనం నందున మండల సర్వ సభ సమావేశానికి ఎంపీటీసీలు జడ్పీటీసీలు మండల స్థాయి అధికారులు తో పాటు సంబంధిత అధికారులు సమావేశానికి సకాలంలో హాజరై మండలంలోని ఏవైనా సమస్యలు పరిష్కరించుకోవాలని ఆమె అందులో పేర్కొన్నారు.

30న వాహన వేలంపాట

విశాలాంధ్ర-పులివెందుల: స్థానిక సెబ్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీన పులివెందుల స్టేషన్ పరిధిలో నాటుసారా కేసులో పట్టుబడి వాహనానికి వేలంపాట నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో స్టేషన్ సూపరింటెండెంటు వారి ఆదేశాల మేరకు ఉదయం 11గంటల ప్రాంతంలో ఈ వేలంపాట నిర్వహిస్తున్నామన్నారు. వేలంపాటలో వాహనం దక్కించుకున్న వ్యక్తి డబ్బుతో పాటు జీఎస్టీ కూడా చెల్లించాల్సి ఉందన్నారు. మరిన్ని వివరాల కోసం సెబ్ కార్యాలయాన్ని సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

సీనరేజ్ ట్రీట్‌మెంట ప్లాంటు పరిశీలన

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణ పరిధి లోని శిల్పారామం సమీపంలో ఏర్పాటు చేయనున్న సీనరేజ్ ట్రీట్‌మెంటు ప్లాంటును గురువారం వైసీపీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టరు వరప్రసాద్, మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా మోటార్ల సామర్థ్యం తదితర అంశాలను వారు సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. నిర్వహణలో లోపం ఉన్నట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వారు సిబ్బందికి సూచించారు.

బిజెపి బలోపేతానికి కృషి

విశాలాంధ్ర-లింగాల: లింగాల మండల వ్యాప్తంగా బిజెపి బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ మండల ఇన్‌చార్జి శ్రీరాములు, బిజెపి నాయకులు తేరా మహేశ్వరరెడ్డి, రాజశేఖర్, మండల కమిటీ సభ్యులు రామిరెడ్డి కృష్ణయాదవ్, హుసేన్‌పీరాలు అన్నారు. లింగాలలో మండల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా బూత్‌లు వారిగా బూత్ కమిటీలు, ఐదు బూత్‌లు కలిపి కేంద్రంగా ఏర్పాటు చేస్తామన్నారు. బూత్ కమిటీల వల్ల పార్టీ సంస్థాగతంగా పార్టీ అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అధిష్టానం సూచనల మేరకు తాము కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికలకు రాష్ట్రంలో బిజెపి అతిపెద్ద శక్తిగా ఎదుగుతుందని వారు ధీమా వ్యక్తంచేశారు.

వైభవంగా విఘ్నేశ్వరున్ని నిమజ్జనానికి తరలింపు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల కేంద్ర పరిధిలోని వీరనారాయణ పురంలో వెలసిఉన్న విఘ్నేశ్వరున్ని నిమజ్జనానికి ఉత్సవ కమిటి సభ్యులు ఉమాపతి భాస్కర్‌రెడ్డి, ఉత్సవ కమిటి సభ్యులు ఆధ్వర్యంలో నిమజ్జనానికి బ్రహ్మంసాగర్‌కు అంగరంగా వైభవంగా మేళతాళాలు, మంగళవాయిద్యాలతో కళాకారుల ద్వారా భజనలతో నిమజ్జనానికి తరలించారు. గత 18వ తేది నుండి ప్రత్యేకంగా పూజలు అందుకొని, వివిధ కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు. వీరనారాయణపురం పురవీధుల్లో భారీగా ఊరేగింపుతో, బాణాసంచా, మంగళవాయిద్యాలతో తరలించారు. నిమజ్జనానికి బ్రహ్మంగారి మఠం ఎస్ఐ విద్యాసాగర్ ప్రత్యేకంగా ట్రాఫీక్ సమస్యలు తలెత్తకుండా చూశారు. బ్రహ్మంసాగర్ వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింల ర్యాలీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : సృష్టికర్త అల్లాహ్ ఆజ్ఞను పాటించే మహమ్మద్ ప్రవక్త రసూలిల్లాహ్ జన్మదిన శుభ సందర్భంగా కడప ముస్లిం సోదరులందరూ మూకుముడిగా కలిసి కట్టుగా వేలాదిమంది తాలిం మజీద్ నుండి ర్యాలీగా చెన్నూరు బస్టాండ్, మద్రాస్ రోడ్, గోకుల్ లాడ్జ్, నుండి సెవెన్ రోడ్స్ సర్కిల్, పాత బస్టాండ్ మీదుగ గుంత బజార్ మసీదు వరకు వేలాది మంది ముస్లిం సోదరులు యువకులు, విద్యార్థులు, విద్యావంతులు, ప్రముఖులు, మేధావులు, కర్షకులు, కార్మికులు అతి భారీ పెద్ద సంఖ్యలో కలిసి మనస్ఫూర్తిగా ర్యాలీలో పాల్గొనడం జరిగినది. అనంతరం మన ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం వారి ఆదేశాల మేరకు ఆయన సంకల్పంతో ముస్లిం సోదరులు అందరూ జీవిస్తామని తెలియజేయడం జరిగినది. ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు విఎస్ అమీర్ బాబు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో మత పెద్దలు, దర్గా పీఠాధిపతులు, ముస్లిం సీనియర్ నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం మసీదులో దాదాపు 100 మంది ముస్లిం సోదరులు రక్తదానం చేయడం జరిగినది. అలాగే విఎస్ అమీర్ బాబు అనుచరులు షేక్ నాసర్ అలీ, సయ్యద్ రెహమాన్, వెంకటేష్ యాదవ్, కొండ సుబ్బయ్య, బండి జయశంకర్, చాన్ భాష, నూర్ భాషా, ఆదిల్, గౌస్ బాష, సయ్యద్ భాష, నజీర్ భాష, షేక్ మొహమ్మద్ భాష తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన సీఎం జగన్ : తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: జగన్ పాలనతో నిరుద్యోగులు బాగా మోసపోయారని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఘాటుగా విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ తాను అధికారంలోకి రాగానే ఏటా జనవరిలో నిరుద్యోగుల కోసం జాబ్ కేలండరు విడుదల చేస్తామని అనేకమార్లు హామీలమీదహామీలు గుప్పించార న్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత జాబ్‌కేలండరు ఊసెత్తకుండా మిన్నకుండిపోయారన్నారు. ఏరుదాటినంత వరకు ఓడమల్లన్న ఏరు దాటిన తర్వాత బోడిమల్లన్న అన్న చందంగా జగన్ పాలన తయారైందన్నారు. దీని వల్ల నిరుద్యోగులు తీవ్రంగా మోసపోవడమే కాకుండా ఉద్యోగ, ఉపాధి కోసం యువత ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిందన్నా రు. ఇప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ సమస్య తాండవం చేస్తోందన్నారు. అయినా జగన్‌కు కనువిప్పు కలగకపోవడం రాష్ట్ర ప్రజల దురదృష్టమన్నారు. నిరుద్యోగులకే అనుకుంటే ఉద్యోగ, ఉపాధ్యాయులను కూడా జగన్ మోసం చేశారన్నారు. ఎన్నికల ముందు జగన్ చేసిన వాగ్దానాలకు ఇచ్చిన హామీలను నమ్మి నిరుద్యోగులు జగన్‌కు ఓట్లు వేశారన్నారు. కానీ ఇప్పుడు తలచుకుంటే అంతా మోసపోయామని నిరుద్యోగులు బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రెండు లక్షల 50వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారన్నారు. జగన్ తీరు చూస్తే వీరి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటికైనా మేనిఫెస్టోలో చేర్చిన అంశాలన్ని జగన్ నెరవేర్చాలని లేదంటే రాబోవు ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.

దివ్యాంగులకు గృహోపకరణాల వితరణ

విశాలాంధ్ర-పులివెందుల: స్థానిక వికలాంగుల నెట్‌వర్క్ కార్యాలయంలో గురువారం దివ్యాంగులకు గృహోపకరణాల వస్తువులు వితరణ అందించారు. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ తొలితరం యువనాయకుడిగా, విప్లవవీరుడిగా పేరుగాంచిన భగత్ సింగ్ 116వ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ వైకల్యం శరీరానికేకాని మనసుకు కాదని, దివ్యాంగులు దైవసమానులని వారిని ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దివ్యాంగులపై జరుగుతున్న అన్యాయాలను తమ దృష్టికి తీసుకొస్తే వాటిని తగిన పరిష్కారం అందిస్తానని వెల్లడించారు. వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ 1907 సెప్టెంబరు 28వన పంజాబ్‌లో జన్మించిన భగత్‌సింగ్ చిన్న వయసులోనే దేశభక్తిని చాటుకున్నారన్నారు. తెల్లదొరలను గడగడలాడించిన విప్లవవీరులలో భగత్‌సింగ్ ఒకరన్నారు. ఈ సందర్భంగా కెనరాబ్యాంక్ ఉద్యోగి నల్లపురెడ్డిపల్లెకు చెందిన మూలి వెంకటరమణారెడ్డి అను అంధుడు అందజేసిన గృహోపకరణాలను వెంకటరమణారెడ్డి సేవా స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వేణు, అమీర్, హరికృష్ణ, బాషా తదితరులు పాల్గొన్నారు.

14వ రోజు దీక్షలో పాల్గొన్న సీఎం సురేష్‌నాయుడు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు సీఎం సురేష్‌ణాయుడు 14వ రోజు నిరాహీర దీక్షలో పాల్గొన్నారు. ఈ దీక్షకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్, తెలుగుయువత కార్యదర్శి నల్లబోతుల నాగరాజులు సంఫీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కుట్రలో భాగంగానే చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. అక్రమ అరెస్టలతో రాష్ట్ర ప్రభుత్వం సాధించింది ఏమిలేదన్నారు. చంద్రబాబు అరెస్ట్ దారుణం అని, 42ఏళ్ల సుదీర్ఘ రాజకీయ పాలనలో చంద్రబాబు మచ్చలేని వ్యక్తిగా ఉన్నారని అన్నారు. రాజకీయ కక్షసాధింపు సాధింపు చర్యలో భాగంగానే చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందని అన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఈ దీక్షలో జిల్లా పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ నరసింహా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ రెడ్డి అరాచకం పరాకాష్టకు చేరింది

విశాలాంధ్ర -కమలాపురం : తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక రైల్వే గేట్ సమీ పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద నిజకవర్గ కేంద్ర పరిధిలోని పెండ్లిమర్రి మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు 16వ రోజు రిలే నిరాహార దీక్షలో నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమలాపురం నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్త నరసింహారెడ్డి కడప జిల్లా టిడిపి అధ్యక్షుడ మల్లెల లింగారెడ్డి టిడిపి రాష్ట్ర తెలుగు మహిళ కార్యనిర్వాహ కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుతో జగన్ రెడ్డి అరాచకం పరాకాష్టకు చేరింది. వచ్చే ఎన్నికల్లో వైసిపి కనుమరుగు అవ్వడం ఖాయమన్నారు. జగన్ రెడ్డి దుర్మార్గ పాలన పై తిరుగుబాటు మొదలైందని ఇప్పటికే జగన్మోహన్ రెడ్డికి తెలిసుంటుందని ఆయన అన్నారు..జగన్ రెడ్డి లాంటి నియంతకు ఓటు వేసినందుకు ప్రజలందరూ సిగ్గుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు వచ్చే ఎన్నికల్లో వైసీపీ కనుమరుగు అవడం ఖాయం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం కచ్చితంగా వస్తుందని ముక్కంఠంగా తెలిపారు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఆ రెండు పాఠశాలల నడుమ కుక్కల బెడద

విశాలాంధ్ర-వేంపల్లె: వేంపల్లె పంచాయతీ పరిధి లోని ఉషాకిరణ్, చైతన్య పాఠశాలల మధ్యలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఆ ప్రాంత ప్రజలు ఆరోపించారు. వారు మాట్లాడుతూ కుక్కలు స్వైర్య విహారం చేయడం వల్ల ఆ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు భయాం దోళనకు గురవుతున్నారన్నారు. విద్యార్థులనే కాకుండా ప్రజలను కూడా కుక్కలు టార్గెట్ చేస్తున్నాయన్నారు. దీని వల్ల ఆ ప్రాంతంలో నడవాలంటే ఎంతో ఇబ్బంది గా ఉందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై వాలంటర్లీతో సహా సెక్రటరీకి ఫిర్యాదు చేశామన్నారు. కానీ అధికారులు మాత్రం ఏ మాత్రం తమ విన్నపం పట్ల చలించలేదన్నారు. ఈ విషయమై సర్పంచు ఆర్ శ్రీనివాసులు లేదా జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రిలు స్పందించి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ మేరకు తాము ఈవో సుబ్బారెడ్డికి విన్నవించినట్లు వారు వెల్లడించారు.

తిప్పలూరు హరిజనుల నిరసన

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండల పరిధిలోని తిప్పలూరు గ్రామానికి చెందిన హరిజనులు గురువారం స్థానిక నాలుగు రోడ్ల కూడలి లో నిరసన వ్యక్తం చేసిన ఘటన చోటుచేసుకుంది. తిప్పలూరు గ్రామంలో తమ పండుగలు, వివాహ వేడుకలు వంటి కార్యక్రమాల సమయంలో తాము వివక్షతకు గురవుతున్నా మంటూ వారు ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా హరిజనవాడలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడి గ్రామోత్సవంపై కూడా పలువురు స్థానికుల నుండి (అగ్రవర్ణాలు) ఆంక్షలను ఎదుర్కోవాల్సి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సామాజిక వర్గపు వివాహ సమయాల్లో నూతన వధూవరుల మెరవణి విషయంలో సైతం కొన్ని నివాస గృహాల ముందు వాహనం దిగి నడిచి వెళ్లాల్సి వస్తోందని వారు గుర్తుచేశారు. గ్రామంలోని ఇతర సామాజిక వర్గీయులను ఒక రకంగాను తమను మరో రకంగానూ చూస్తున్నారని వారు వివరించారు. తొలుత వీరు స్థానిక పోలీసు స్టేషన్‌కు వెళ్లి సమస్యను వివరించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి చేరుకొని కొద్దిసేపు నిరసన కార్యక్రమం చేపట్టారు. తమకు న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మైదుకూరు ఇన్‌ఛార్జి శ్రీరామ వంశీ, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఓబులేసు, మాల మహానాడు నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పువ్వుతో టీడీపీ నేతల వినూత్న నిరసన

విశాలాంధ్ర - మైదుకూరు : టిడిపి జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ కు నిరసనగా ఇన్ ఛార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు 16వ రోజు చెవిలో పువ్వులు తో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మైదుకూరు నియోజకవర్గ టీడీపీ అనుబంధ విభాగం బిసి సెల్ కమిటీ సభ్యులు, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా భగత్ సింగ్ 116 జయంతి నివాళలు

విశాలాంధ్ర - మైదుకూరు : బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ వేగుచుక్క స్వాతంత్ర ఉద్యమ సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ అని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్ లు కొనియాడారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో మైదుకూరు పట్టణంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో భగత్ సింగ్ 116 వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కోట్లాది ఉద్యోగాలు ఇస్తామన్నా బిజెపి, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానన్న వైయస్ జగన్మోహన్ రెడ్డి యువత పట్ల చూపిస్తున్న వైఖరిని తిప్పి కొట్టాలని యువతకు పిలుపునిచ్చారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రత్యేక సమావేశం

విశాలాంధ్ర - కడప : జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తమ ఛాంబర్ నందు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పై ప్రత్యేక సమావేశం ప్రోగ్రాం అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు.30.9 .23వ తేదీ నుండి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా జరిగే శిబిరాల ప్రణాళికలు, కార్యక్రమం నిర్వహణ, స్పెషలిస్ట్ డాక్టర్ల సమాచారం మరియు కార్యక్రమం నందు ఏర్పాట్లు .మండల తహసీల్దారులతో ,మండల అభివృద్ధి అధికారులతో సమన్వయం చేసుకోవడం. మెటీరియల్ అందుబాటులో ఉంచడం మొదలగు వాటి గురించి చర్చించి ఉదయం 8 గంటల నుండి సిబ్బంది అందుబాటులో ఉండాలని, కార్యక్రమం విజయవంతం చేయాలని టెలికాన్ఫరెన్స్ ద్వారా డాక్టర్స్ కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ మహేశ్వర కుమార్, జిల్లా గణాంక అధికారి రమేష్ రెడ్డి, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ప్రముఖ రచయిత, కవి, సాహితీకారుడు, నవయుగ చక్రవర్తి గుఱ్ఱం జాషువా సేవలు ఎనలేనివని డిఆర్వో గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన హాల్ లో ప్రముఖ నవయుగ కవి, సాహితీకారుడు గుఱ్ఱం జాషువా జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి డిఆర్వో గంగాధర్ గౌడ్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కడు పేద కుటుంబం నుంచి అంతర్జాతీయ స్థాయికి గుర్తింపు పొందిన మహనీయుల్లో జాషువా చాలా గొప్పవాడన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు గుఱ్ఱం జాషువా సాహితీ జీవితంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీవో వెంకట్రావు, జిల్లా టూరిజం అధికారి ఎస్. మల్లికార్జున, డీసీవో సుభాషిణి, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డా. శారదమ్మ, కలెక్టరేట్ ఏవో విజయ్ కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ జ్ఞానేంద్ర, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాబు కోసం నేనుసైతం అంటూ చిన్నారిలోకం
నాభవిష్యత్ బాబుదే అంటున్న చిన్నారి యువాన్ష్‌రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: చంద్రబాబు కోసం నేను సైతం అంటూ చిన్నారిలోకం నినదిస్తోంది. తల్లిదండ్రుల తర్వాత నా భవిష్యత్ బాబుదే అంటూ టీడీపీ రిలేదీక్షలో చిన్నారి యువాన్ష్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ స్థానిక టీడీపీ కార్యాలయంలో గత కొంత కాలంగా ఇన్‌చార్జి బిటెక్ రవి ఆధ్వర్యంలో రిలేదీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ దీక్షలో ఇది వరకు పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు మద్దూరు వెంకటరామిరెడ్డి మనమరాలు చంద్రబాబుకు సంఘీ భావం తెలిపిన విషయం తెలిసిందే. తాజాగా వెంకటరామిరెడ్డి మరో మనుమడు యువాన్స్ రెడ్డి కూడా గురువారం దీక్షలో కూర్చున్నాడు. నా భవిష్యత్ కోసం పోరాటం, నా భవిష్యత్ కోసం బాబు కోసం నేను సైతం మెన్నంటి ఉంటానంటూ ముద్దుముద్దు మాటలతో అందరి ఆశ్చపరచాడు. తల్లిదండ్రులు జన్మనిచ్చినంత వరకేనని ఆ తర్వాత నా భవిష్యత్ బాధ్యత బాబుదే అంటూ యువాన్ష్‌రెడ్డి మాటల్లో అర్థమయ్యేలా అందరినీ సంతోషానికి గురిచేసింది. గురువారం దీక్షలు కూర్చున్న వారిలో చిన్నారి యువాన్స్‌రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ప్రజలందరి ఆరోగ్య సంరక్షనే జగనన్నా సురక్ష లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రజలందరి ఆరోగ్య సంరక్షనే లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్యం గురించి తెలుసుకొని, ముందస్తుగానే ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం జగనన్నా ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఏఎన్ఎంలచే జగనన్నా సురక్ష కింద పలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికి ఆరోగ్యం అందించడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రతి ఇంటికి వైద్య నిపుణులు వచ్చి అనేక రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇప్పటికే అనేక రకాల సంక్షేమ పథకాలను తీసుకువచ్చారని, ఇప్పుడు ప్రజల ఆరోగ్యం కోసం మరో బృహత్తరమైన కార్యక్రమాన్ని తీసుకువస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని త్రపి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని, ప్రతి వ్యక్తిని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచే కార్యక్రమమే ఈ జగనన్నా సురక్ష అన్నారు. ప్రజల అనారోగ్య సమస్యలు ఇంటింటికి వెళ్లి ముందే తెలుసుకొని దానికి తగ్గ మందులు, వైద్య శిబిరాలు ఏర్పాటుచేయడం ఈ కార్యక్రమం ప్రత్యేకత అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజు, పోలీస్‌కంప్లైంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగశేశారెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుల్‌రెడ్డి, ద్వార్శల భాస్కర్‌రెడ్డి, రాయపురెడ్డి, అగ్గారపు శ్రీనివాసులు, పోరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ మరింత బలోపేతం
8 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు
వైసీపీ విద్యార్థి విభాగం నేత ఆర్ఎస్ షాహీద్

విశాలాంధ్ర-యర్రగుంట్ల : రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు వీలుగా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ద్వారా 8 కేంద్రీయ విశ్వవిద్యాలయాలను మంజూరు చేయించుకోవడం హర్షనీయమని వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ షాహీద్ అన్నారు. గురువారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇప్పటికే విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 87 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు మంజూరైతే అందులో 8 మన రాష్ట్రానికే దక్కడం రాష్ట్ర ప్రభుత్వ ఘనత అని కొనియాడారు. నాడు-నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చడంతో పాటు పేద, ధనిక వ్యత్యాసం లేకుండా విద్యార్థులందరికీ ఏకరూప దుస్తులు సమకూర్చిన ఘనత కూడ తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అలాగే ఇంగ్లీష్ విద్యను అందుబాటులోకి తెచ్చి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లడం జరిగిందని ఆయన వివరించారు. మధ్యాహ్న భోజన పథకంలో నూతన మెనూను ప్రవేశపెట్టి నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో విద్యార్థి విభాగం జిల్లా నాయకులు బోరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అన్నమయ్య జిల్లా



వైసీపీకి సమాధి కడతాం: టిడిపి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ఆరాచక వైసిపి ప్రభుత్వానికి అంతిమ ఘడియలు దగ్గర పడ్డాయి,సమాధి కడతాం అని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు హెచ్చరించారు. రిలేనిరాహార దీక్షలు గురువారానికి 16 రోజుకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచ్చ లేని చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసు బనాయించడం ఆరాచక ప్రభుత్వానికి నిదర్శనం అన్నారు.బిసి సెల్ రాష్ట్ర నాయకులు కమతం నాగరాజు మాట్లాడుతూ జగన్ మోసంరెడ్డి అధికార యంత్రాంగాన్ని తమ చెప్పుచేతల్లోకి తీసుకుని అక్రమ కేసులు పెట్టడానికి తప్ప ఇంక దేనికి పనికిరాదని విమర్శించారు. అక్రమ కేసులు బనాయించినా జైలుకు పంపించినా జైల్లో కూడా ఉద్యమాలు కొనసాగిస్తామని ఆరాచక ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ అక్రమ కేసులకు బలంలేదని నిలబడదని పేర్కొన్నారు.చంద్రబాబు అక్రమ అరెస్టు ను యావత్ ప్రపంచ మంతా గమనించి తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు.దుర్మార్గ ప్రభు త్వంపై పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.45 సంవత్సరాలలో ఎన్ని కేసులు పెట్టారో ఒక్కటైనా నిరూపించారా అని సవాల్ విసిరారు.టిడిపి నాయకులు పులెల రమేష్ బాబు,పందేటి వెంకటరామరాజు,గాంది నాయుడు, గంగరాజు వెంకటేశ్వరరాజు, యర్రగుండ్ల జయప్రకాష్, మద్దిన గిరినాయుడు, దుద్యాల జయచంద్ర, అనితదీప్తి, అకేపాటి

సుకుమార్ రెడ్డి,గ్రంది బాలసుబ్రమణ్యం, వల్లెపు శివకుమార్, వలిమి కుమార్ తదితరులు రిలేనిరాహారదీక్షలలో కూర్చోని వైసిపికి సమాధి కడతాం అని ప్రతిన బూనారు.

ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థను నడుపుదాం

విశాలాంధ్ర -మదనపల్లి : ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను నడపాలని మదనపల్లె రూరల్ సీఐ సత్యనారాయణ సూచించారు. తన కార్యాలయంలో ఎస్సై లు, పోలీసులతో గురువారం సీఐ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పోలీసులు స్టేషన్ కే పరిమితం కాకుండా పల్లెబాట చేపట్టి ప్రజలతో మమేకం కావాలని ఆదేశించారు. తద్వారా ప్రజా సమస్యలను అక్కడి కక్కడే పరిస్కారం అవుతాయని.. నేరాల నియంత్రణ సులభతరం అవుతుం దని తెలిపారు. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను నడపడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని నేరాలు తగ్గి ముఖం పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ సుధాకర్ సిబ్బంది ఉన్నారు.

రూ.73 వేలు పలికిన లడ్డు వేలం

విశాలాంధ్ర -సుండుపల్లె: మండల కేంద్రంలోని వినాయక్ నగర్ లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వినాయకునీ లడ్డు వేలం రూ.73 వేలకు బలరాం కైవసం చేసుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. అనంతరం వినాయక చవితి మండపం వద్ద ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేలంలో పాల్గొని లడ్డు స్వాధీనం చేసుకున్న భక్తులకు వినాయకుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణపయ్యలు

విశాలాంధ్ర-పీలేరు: గత నవరాత్రులు పూజలు అందు కున్న ఘనపయ్యలు గురువారం గంగమ్మ వడికి చేరుకు న్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినా యక విగ్రహాలను మేళ తాళాలతో, బృంద నాట్యాలతో ఊరేగించారు. యువకులు మహిళలు ప్రదర్శ నగా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఊరేగింపులో భాగంగా ప్రజలు సేద తీరేందుకు పానీయాలు మంచి నీరు అందించారు. ఆహ్లాదకరంగా, ఉత్సాహంగా నిర్వహించిన నిమజ్జన కార్యక్రమం చూపరులకు వీనుల విందు కాల్చింది.

గుర్రం జాషువా సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: గుర్రం జాషువా సేవలు చిరస్మరణీయమని గుర్రం జాషువా జయంతి వేడుకలలో జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లో అయన ఆధ్వర్యంలో నిర్వహించిన గుర్రం జాషువా జయం తి సందర్భంగా జిల్లా అధికారులు గుర్రం జాషువా ఫోటో కి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం, లక్కిరెడ్డిపల్లి జూనియర్ కళాశాలలో అధ్యాప కుడిగా పనిచేస్తున్న సహదేవ రెడ్డి మాట్లాడుతూ... గుర్రం జాషువా గారు కవిత్వము అనే ఆయుధంతో సమాజాన్ని మేల్కొల్పారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజ, పిడి హౌసింగ్ సాంబశివయ్య, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అబ్సోలాం, పాల్గొన్నారు.

విశ్వ మానవుడు గుర్రం జాషువా

విశాలాంధ్ర -రాజంపేట: నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ బిరుదాంకితులు మహాకవి గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలు రాజంపేటలో ఘనంగా జరిగాయి. తెలుగు భాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్థానిక జవులీ బజారులోని సరస్వతీ విద్యా మందిరంలో జాషువా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా సహాయక కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ మాట్లాడుతూ గౌరవం అనేది కులానికా... గుణానికా... అనే రోజుల్లో పుట్టి పెరిగిన గుర్రం జాషువా దారిద్ర్యాన్ని అనుభవిస్తూ కుల మత భేదాలను తన రచనల ద్వారా నిరసిస్తూ విశ్వ మానవుడిగా ఎదిగాడన్నారు. తన నిజ జీవితంలో ఎన్నో అమానవీయ సంఘటనలను ఎదుర్కొన్న జాషువా మానవీయ దృక్పథంతో రచనలు చేసి మహాకవిగా పేరు పొందాడని ఆయన శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా సంరక్షణ సమితి ప్రతి నిధులు బివి నారాయణరాజు, యూపీ రాయుడు, గుం టూరు రామయ్య, సుబ్రహ్మణ్యం, దయాకర్, ఉష, ప్రియాంక తదితరులు పాల్గొని గుర్రం జాషువా చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

నవరత్నాలలో భూ పంపిణీ చేర్చాలి

విశాలాంధ్ర-మదనపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు బాపట్లలో జరిగిన రాష్ట్ర 22వ మహాసభలలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అన్నమయ్య జిల్లా నుండి తోపు కృష్ణప్ప ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కృష్ణప్ప తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ బంజర భూములు అసైన్మెంట్ భూములు పేదలకు పంపిణీ చేయడంతో పాటు కోనే రంగారావు భూ కమిటీ సిఫారసులు అమలు చేయాలని ప్రతి పేదవాడికి ఒక హెక్టారు సాగు భూమి ఇవ్వాలన్నారు. నవరత్నాలలో భూ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ సంవత్సరం బాపట్లలో ఈనెల 25 ,26 ,27 తేదీలలో జరిగిన మహాసభ తీర్మానం ప్రవేశపెట్టగా ఈ మహాసభ తీర్మానాన్ని ఆమోదించడం జరిగింది. ఆరుగాలం శ్రమిస్తూ జీవన భృతి పొందుతూ ఆహార ఉత్పత్తులకు కారకులైన గ్రామీణ కష్టజీవులకు సాగు భూములు పంపిణీ చేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ఇంకా ప్రభుత్వ మిగులు భూములు లక్షలాది ఎకరాలు ఉన్నాయని లక్షల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని వాటిని పేదలకు దక్కే దాకా భూ పోరాటాలు కొనసాగిస్తామని వారు తెలిపారు.ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు పరచాలని ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సక్రమంగా అమలు జరపాలని, దళితులపై దాడులను అడ్డుకోవాలని, పై తీర్మానాలన్నిటిని రాష్ట్ర మహాసభలు ఏకాగ్రీవంగా ఆమోదించారు.

అనాథ మహిళకు వివాహం చేసిన స్వర్ణభారత్ ట్రస్ట్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మానవత్వం లోపిస్తున్న ఈ రోజులలో తల్లిదండ్రులు లేని ఆనాథ ఆడబిడ్డలకు నెల్లూరు జిల్లా వెంకటా చలం లోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఛైర్మన్ దీపా వెంకట్ దిక్కు అయింది.గురువారం తిరుపతి కమ్మవారి అభ్యుదయ భవనం నందు పెద్ద బిడ్డ శిరీష ను,శివ కు ఇచ్చి వివాహం చేశారు.శిరీష పేరున ఛైర్మన్ ఒక లక్షరూపాయలు ఫిక్స్ డిపాజిట్ చేసి, బంగారు కమ్మలు, ఉంగరం వధూవరులకు ఇచ్చి ఆశీర్వాదించారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం, చియ్యవరం గ్రామపంచాయతీలోని నడింపల్లి కి చెందిన రజక కులస్తులు తండ్రి మడితపు శివయ్య, భార్య బుజ్జమ్మ అయినటువంటి తల్లిదండ్రులు ఇద్దరు 2016 లో మృతి చెందారు.దీంతో 5 మంది ఆడపిల్లలు మొదటి పాప శిరీష, రెండవ పాప ప్రసన్న,మూడవ పాప మల్లీశ్వరి,నాలుగవ పాప నందిని,ఐదవ పాప లిజిత ఐదు మంది దిక్కు మొక్కు లేని ఆనాథలయ్యారు.దీంతో స్వర్ణ భారత్ ట్రస్ట్ ఛైర్మన్ దీపా వెంకట్ అక్కున చేర్చుకుని విద్యా బుద్ధులు నేర్పించారు.మిగిలిన నలుగురు ఆడ బిడ్డలు ఉన్నత చదువుల కోసం కృషి చేస్తున్నారు. పెద్దపాప శిరీష వివాహ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి,మాజీ రాష్ట్ర కార్యదర్శి పోతుగారు శ్రీకాంత్, భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా హార్టికల్చర్ స్టేట్ కన్వీనర్ తోట శ్రీనివాసులు,మణి ట్రస్ట్ సిబ్బంది పాల్గొని వధూవరుల ను ఆశీర్వాదించారు.

భవ్యశ్రీకి న్యాయం కోరుతూ కొవ్వొత్తులతో ర్యాలీ

విశాలాంధ్ర-రాయచోటి: మైనర్ బాలిక భవ్యశ్రీ పైశా చిక హత్యను నిరసిస్తూ స్థానిక శివా లయంసర్కిల్ నుండి బంగ్లా సర్కిల్ వరకూ వడ్డెరకుల పెద్దలతోకలిసి వివిధ సంఘాల నాయకులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 21 న చిత్తూరుజిల్లా పెనుమూరు మండ లంలో ఇంటర్ చదువుతున్న భవ్య శ్రీ ధారుణహత్యకుగురై బావి లో శవమైతేలిన విషయం తెలిసిం దే.హంతకులను అదుపులోకి తీసు కుని కఠినంగా శిక్షించాలని, ప్రియాంక రెడ్డికంటే ఘోరంగా చంపబడ్డ భవ్య శ్రీవడ్డేపట్ల ప్రభుత్వం, మీడియా చిన్న చూపు అన్యాయమని,న్యాయంజ రిగేవరకూ పోరాడతామని నినాదా లుచేశారు.ర్యాలీలో వడ్డెర మేధావు లఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.జీవానం దం,టిడిపి వడ్డెర సాధికారతసమితి అన్నమయ్య జిల్లా ప్రతినిధి పి.నాగా ర్జున ఏఐఎస్ఎఫ్ అన్నమయ్యజిల్లా ప్రధానకార్యదర్శి పి. కోటేశ్వరరావు ఏ.పీ బార్ అసోసి యేషన్ అన్నమ య్య జిల్లా బి.సి అధ్యక్షుడు డి.నాగ ముని టి.రామాంజులు ఆర్.ఆంజ నేయులు, సి.రమణ రియల్టర్ ఆర్. రాంప్రసాద్ బిజెపి ఓబీసీ మోర్చా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆర్. శివప్రసాద్ టిడిపి వడ్డెర సాధికారత సమితి అన్నమ య్యజిల్లా అధ్యక్షు డు కె. శివరాం,పి.నారాయణ సి.జ నార్ధన,శివకుమార్ క్రిష్ణ,మణి, నందు,ఠాగూ ర్,సాయి,రమణ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాయచోటి మండలము దిగువ అబ్బవరంకు చెందిన రజనీకాంత్ కుమారుడు అఖిల్ అనే యువకు డు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ బెంగళూరు సిటీలో హాస్ప టల్ లో చికిత్స పొందుతు న్నారు. రజనీ కాంత్ కుటుంబసభ్యులు గురువా రం మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి దృష్టికి తీసుకురాగా అఖిల్ హాస్పటల్ ఖర్చులకు ఆర్థిక సహాయం అందచేశారు, అనంతరం మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి మాట్లా డుతూ చిన్న వయసులోనే అఖిల్ కు కిడ్నీలు దెబ్బతినడం చాలా చింతించవలసిన విష యం అని దేవుని ఆశీస్సులతో అఖిల్ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సీఎంను కలిసిన మంత్రి శివారెడ్డి

విశాలాంధ్ర -సుండుపల్లె: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని సుండుపల్లె మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నీటి సంఘం అధ్యక్షులు మంత్రి శివారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు బైరేగుట్ట సమీపంలోని వైయస్సార్ విగ్రహ ప్రారంభోత్సవానికి ఆహ్వానించగా జిల్లాలోని మంత్రులు ఎంపీలు నాయకులుతో కలిసి రాజన్న విగ్రహాన్ని ప్రారంభించాలని సూచించినట్లు తెలిపారు అలాగే మండలంలోని నీటి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు తొందరలో రోళ్లమడుగు మంచినీటి పథకం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నిమజ్జనానికి తరలిన బొజ్జ గణపయ్య

విశాలాంధ్ర -సుండుపల్లె: మండ లం కేంద్రంలో వినాయక నగర్ లో ఏర్పాటుచేసిన గణనాధుని నిమజ్జనానికి గురువారం తరలిం చారు.ఉదయం నుండి వినాయక స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ కమిటీ సభ్యులు,వినాయక్ నగర్ వాసులు మేళ తాళాలతో,డప్పు వాయిద్యాలతో బాణసంచాలు పేలుస్తూ గణనాథుని ఊరేగింపు పురవీధుల్లో నిర్వహించారు. డీజే ని ఏర్పాటు చేసి యువకులు ఎంతో అత్యుత్సాహంతో డాన్సులు ప్రదర్శించి భక్తిశ్రద్ధలతో తరలి వెళ్లి కృష్ణారెడ్డి చెరువులో నిమజ్జనం చేశారు.

జాషువా, భగత్‌సింగ్‌ల స్ఫూర్తిని కొనసాగించడమే దేశభక్తి

విశాలాంధ్ర -మదనపల్లి: జాషు వా, భగత్ సింగ్ ల స్ఫూర్తిని కొనసాగిం చడమే సిసలైన దేశభక్తి అని, వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీ యం శివప్రసాద్ స్పష్టం చేశారు. నవయుగ కవిచక్రవర్తి, కవికోకిల గుర్రం జాషువా, మరియు స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ ల జయంతులను పురస్కరించుకొని, గురువారం స్థానిక బాస్ కార్యాలయం నందు ఘనంగా వేడుకలు నిర్వహిం చారు. వీసీకే పార్టీ మరియు భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) సంయుక్తంగా నిర్వహించిన ఈవేడుకలకు పీటీయం శివప్రసాద్ ముఖ్యఅతిధిగా హాజరైనారు. ఈసందర్భంగా వీసీకే, బాస్ నేతలు గుర్రం జాషువా, భగత్ సింగ్ ల చిత్రపటాలను పూలతో అభిషేకించి, ఘనంగా నివాళులు అర్పించారు. జాషువా, భగత్ సింగ్ ల స్ఫూర్తిని కొనసాగిద్దాం అం టూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ ఫాసిస్టు పాలనపై వీరోచిత పోరాటా లకు యువత సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఎఎస్పీ పెద్దయ్య తోపాటు వీసీకే మరియు బాస్ నాయకులు నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, రాయల్ సూర్య, పవన్ తేజ, సొన్నికంటి రెడ్డెప్ప, రవిశంకర్, జనార్దన్, రెడ్డిప్రసాద్, క్రాంతి, నరేష్, రామప్ప, కదిరిప్ప పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మీలాదున్నది

విశాలాంధ్ర- మదనపల్లి: మిలాద్ ఉన్ నబీ మొహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పుట్టినరోజు సందర్భంగా జరుపుకుంటారు ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మూడో నెల అయినా రబీ ఉల్ అవ్వల్ మాసంలో 12వ రోజున మీలాదున్నబీ పండుగను వేరువేరుగా నిర్వహిస్తారు సున్ని సమాజానికి చెందిన ముస్లింలు రవి మాసంలో 12వ రోజున జరుపుకుంటే రవి మాసంలో 17వ రోజున జరుపుకుంటారు ఈ నేపథ్యంలో మీనాదున్నబీ పండుగ సెప్టెంబర్ 28వ తేదీ గురువారం నాడు జరుపుకున్నారు అరబిక్ భాషలో మిలాద్ ఉన్ నబి అంటే మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం అల్లా ప్రపంచ శాంతి కోరుతూ చివరి ప్రవక్తగా మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ను ఎంపిక చేశారు ముస్లింలందరూ అత్యంత పవిత్రంగా భావించే ఖురాన్ గ్రంథంలో వీటి గురించి పేర్కొనబడినది మొహమ్మద్ ప్రవక్త ను విశ్వశాంతి కోసం అల్లా నియమించారని అందుకే తాను జన్మించిన రోజున ఆయనను స్మరించుకుంటూ ఈద్ ఏ మీలాదున్నబీ పండుగను జరుపుకుంటారు చరిత్రను పరిశీలిస్తే మహమ్మద్ ప్రవక్త సౌదీ అరేబియాలోని క్రీస్తు శకం 570లో పుట్టారని క్రీస్తు శకం 632 సంవత్సరంలో తన తొలి శ్వాస విడిచినట్లు తెలుస్తోంది ముస్లింలందరూ కచ్చితంగా మసీదులు ఇతర ప్రాంతాల్లో ప్రార్థనలు చేస్తారు ఖురాన్ పట్టణం మసీదుల్లో ప్రసంగాలు వంటివి నిర్వహిస్తారు.

ఘనంగా భగత్ సింగ్ 116వ జయంతి

విశాలాంధ్ర-పీలేరు:- భగత్ సింగ్ 116 వ జయంతి సందర్భంగా ఎన్.ఎస్. యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ,ఎన్.ఎస్. యూ.ఐ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సాయి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక పీలేరు లోని ఎస్సీ బాలుర హాస్టల్ నందు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ మాట్లాడుతూ తెల్లదొరల నుంచి ఈ దేశాన్ని విముక్తి కల్పించి,స్వాతంత్ర్యం సాధించడంలో తనదైన శైలిలో పోరాటం చేసి ఉరి కొయ్యలని ముద్దాడి తన ప్రాణాలని తునప్రాయంగా త్యాగం చేసిన మహోన్న తుడు భగత్ సింగ్ అని అన్నారు.ఎ ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యూ.ఐ పీలేరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు మహేష్, నియోజకవర్గ ఎన్.ఎస్.యూ.ఐ నాయకులు అఖిల్,అమర్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ' ఈద్ - మీలాద్ - జులూస్

విశాలాంధ్ర-పీలేరు: మహమ్మద్ మహా ప్రవక్త జన్మదినాన్ని పురస్కరిం చుకొని గురువారం వాల్మీకిపురంలో ముస్లిం లు ' ఈద్ - మీలాద్ - జులూస్ ' కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'మీలా ఉన్ నబీ ' జెండాలు , బ్యానర్లు చేత పట్టుకొని , బ్యాడ్జీలు,కండువాలు ధరించి నినాదాలు చేస్తూ పట్టణంలో నిర్వహించిన ప్రదర్శనతో ధార్మిక శోభ కనిపించింది. అలాగే స్థానిక నాయక వీధి పీర్ల చావిడిలో 'ఆసారే షరీఫ్' ప్రదర్శనను భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. స్థానిక నాయక వీధి, కోనేటి వీధి , హసన్ ఖాన్ వీధి, మక్కా మసీదు వీధులలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మహమ్మద్ మహా ప్రవక్త పవిత్ర జీవిత చరిత్రను కొనియాడుతూ భక్తి గీతాలను ఆలపించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, ముతవల్లీలు,మసీదుల ఇమామ్ లు, జమాత్ పెద్దలు , మీలాద్ ఉన్ నబీ ఉత్సవ కమిటీ సభ్యులు , నౌజవాన్ కమిటీ సభ్యులు, యువత పాల్గొన్నారు.

భగత్ సింగ్ జయంతిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - రాజంపేట: భగత్ సింగ్ జయంతిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నాయకు లు అన్నారు. గురు వారం ఎస్ఎఫ్ఐ రాజంపేట కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కాలేజ్ బాయ్స్ హాస్టల్ నందు భగత్ సింగ్ 116 వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ నరసింహారెడ్డి , ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ బ్రిటిష్ తెల్ల దొరలకు వ్యతిరేకంగా, పరాయి పాలన నుండి విముక్తి కోసం, భారతదేశపు స్వతంత్రం కోసం అతి చిన్న వయసులోనే 23 సంవత్సరాల్లోనే ఉరికంబాన్ని ముద్దాడిన గొప్ప విప్లవ పోరాట యోధుడు భగత్ సింగ్. హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ లో చేరి దీనికి అనుబంధంగా భారత నవజవాన్ సభ స్థాపించి దేశంలోని యువకులను జాతీయత భావాలు,విప్లవ భావాలు,దేశభక్తి నేర్పి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం పోరాటం చేశారన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి యొక్క చరిత్రను నేడు బిజెపి ప్రభుత్వం కర్ణాటకలో భగత్ సింగ్ చరిత్రను పాఠ్యపుస్తకాల నుండి తీసివేయడం సిగ్గుచేటు, బిజెపి ప్రభుత్వానికి నిజమైన దేశభక్తి, జాతీయత భావాలు ఉంటే భగత్ సింగ్ కి భారతరత్న అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యువత,విద్యార్థులు భగత్ సింగ్ యొక్క ఆశయాలతో విద్యార్థుల సమస్యలు పరిష్కారం కొరకు,ఉద్యోగ సాధన కొరకు పోరాటాలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గోవర్ధన్, సురేంద్ర , సాయి ,మధు, లవకుమర్ ,సురేష్ ,రవి పాల్గొన్నారు.

ప్రజల మనిషి యర్రపురెడ్డి రవీంద్రారెడ్డి ఘన నివాళులు

విశాలాంధ్ర -సుండుపల్లె : ప్రజా సేవలో అలుపెరగని యోధునిగా అందరి హృదయా లలో చిరస్థాయిగా నిలిచి సమాజ శ్రేయస్సు కోసం మండల ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషిచేసి,గడిచిన మీ జ్ఞాపకాలు, ఆశయాలు, ఎప్ప టికీ పదిలంగా ఉంటాయని చివరి శ్వాస వరకు మండల ప్రజల కోసమే జీవితం అంకితం చేసిన మహోన్నత వ్యక్తిని మా మదిలో నువ్వు పదిలమని మాజీ సింగిల్ విండో అధ్యక్షు లు రామకృష్ణ రెడ్డి కొనియాడారు గురువారం స్వర్గీయ యర్రపురెడ్డి రవీంద్రారెడ్డి 21వ వర్ధంతి సందర్భంగా సుండుపల్లె బస్టాండ్ కూడలి వద్ద పెద్దయన విగ్రనికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు రామకృష్ణ రెడ్డి, రెడ్డప్పరెడ్డి,మైనారిటీ నాయకులు ఖాదర్ భాషా,యమ్ కే ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, మండల మాజీ ఎంపీపీ శైలజ,పల్లం సుకేసిని, చిన్నగొల్లపల్లె సర్పంచ్ రామా జయచంద్ర, ఎంపీటీసీ నాగేశ్వరావు, మాజీ ఎంపీటీసీలుశకుంతల,చంద్రనాయక్, హరినాథ్ రెడ్డి, ప్రతాప్ నాయుడు, బాబూరెడ్డి,శివప్రసాద్ రెడ్డి,టైలర్ వేణు,బుర్రలదిన్నెపల్లె రామాంజులు,పల్లం చెన్నయ్య,సుబ్బయ్య, రామిరెడ్డి, భగీరథ రెడ్డి, పీడీ నాగార్జున,మహేష్ రెడ్డి,మునిస్వామి బాబూరెడ్డి, వెంకటేష్,నవీన్ ఓబులేసు, పంచాయతీ సిబ్బంది, పెద్దా యన అభిమానులు, యర్రపురెడ్డి అజయ్ రెడ్డి అభిమానులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ పెన్షన్స్ స్కీమ్‌ను తప్ప దేనిని అంగీకరించం



విశాలాంధ్ర- రాయచోటి: ఎన్నికల ప్రచారం లో మాట ఇచ్చినట్లుగా సీపీఎస్ ను రద్దు చేసి ఓపీఎస్ ను పునరుద్ధరించాలనీ ,ఓపీఎస్ ను తప్ప సీపీఎస్ ను గానీ ,జీపీఎస్‌ను గానీ అంగీకరిం చే ప్రసక్తే లేదని బీటీఏ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర అన్నారు. అన్నమ య్య జిల్లా కేంద్రం రాయచోటి లోని ఎమ్మార్వో కార్యాలయం వద్ద గల అంబేద్కర్ చిత్రపటం వద్ద జిపిఎస్ వ్యతిరేక నినాదాలు చేస్తూ జిపిఎస్ ప్రతులను దగ్ధం చేశారు. ఎన్నికల ప్రచారంలో నాడు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ తీసుకొస్తామని ప్రతి ప్రచార సభలలో పదే పదే చెప్పి మమ్మల్ని నమ్మించిన ముఖ్యమంత్రి ప్రస్తుతం పక్కకు తప్పుకోవడం భావ్యం కాదన్నారు. మేము కోరింది ఉద్యోగి ఎలాంటి కాంట్రీ బ్యూషనూ లేని ఓపీఎస్ ను మాత్రమే నని లెక్కల జిమ్మిక్కులు మాటల లాజిక్కులతో కూడిన జీపీఎస్ ను కాదని వారన్నారు. సీపీఎస్ ను రద్దు పరిచి ఓపిఎస్ ను మాత్రమే అమలు చేయాలనీ ఇతరా ఏ పెన్షన్ స్కీమ్ ను అంగీకరించే ప్రసక్తే లేదనీ ఓపీఎస్ అమలు చేసేవర కూ మా పోరాటం కొనసాగిస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏవీ రమణా, ట్రెజరర్ గోపాల్ దాస్ రాజశేఖర్ ,బి రెడ్డయ్య చిన్న చెంద్రాయుడు ప్రసాద్ పాల్గొన్నారు.

పేద ప్రజల ఆరోగ్యనికి ప్రభుత్వం అండగా ఉంటుంది: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పీలేరు: పేద ప్రజల ఆరోగ్యానికి ఎల్లవేళలా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని పీలేరు శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి అన్నారు.గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 7 లక్షల రూపాయల చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అహర్ని శలు పేద ప్రజల కోసమే పరితపిస్తున్నారని ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టడం, అమలుపరచడం జరుగు తుందని తెలిపారు.నియోజకవర్గంలో పీలేరు వంద పడకల ఆసుపత్రి కలికిరి వాల్మీకిపురం 50 పడకల ఆసుప లా నిర్మాణం దాదాపు పూర్తిగా ఇచ్చిందని త్వరలో ప్రారంభం చేసేందుకు కృషి చేస్తానన్నారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీం, ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, సంధాని భాష ,బాబి ,ఇబ్రహీం, మహబూబ్ బాషా ,అబ్బాస్, ఆనంద తదితరులు.పాల్గొన్నారు.

నేడు వాల్మీకిపురంలో ఎంపీ,ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర-పీలేరు: నేడు వాల్మీకిపురంలో రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్ద రెడ్డి మిధున్ రెడ్డి పీలేరు శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి లు పర్యటిస్తారని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీం తెలిపారు ఉదయం 9:30 గంటల నుండి వాల్మీకిపురం పట్టణం పునుగుపల్లి నందు ఆక్స మసీదును సందర్శిస్తారు.అలాగే కొత్త ఇందిరమ్మ కాలనీ నందు అబూబకర్ మసీదును ,సిఏ మహల్ వద్ద మక్కా మసీదును కోనేటి వీధి లో మహమ్మదీయా మసీదును ,నాయక్ వీధి జామియా మసీదును, రైల్వే స్టేషన్ వద్ద ఫాతిమా మసీదును నమాజ్ నూరాణి మసీదును, పోలీస్ స్టేషన్ వద్ద ఉమ్మర్ మసీదును ,,బండ మఖాన్ వద్ద ష మ మసీదును, హసన్ ఖాన్ వీధి మదీనా మసీదును, సందర్శించిన అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక హజరత్ ఖాజా పీర్ మస్తాన్వలి దర్గాను సందర్శించి స్థానికులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వ హించడం జరుగుతుం దని ఆయన అన్నారు .కావున మండలంలోని మండల స్థాయి అధికా రులు, ఎంపీపీ, జడ్పిటి సి ,జేసిఎస్ మండల ఇన్చార్జులు, సర్పంచులు ,సచివాలయ కన్వీనర్లు ,గ్రామ వాలంటరీలు, వైయస్సార్ సిపి నాయకులు హాజరుకా వాలని కోరారు.

పాస్‌పోర్ట్ పోయినది

పఠాన్ ఇర్ఫన్ ఖాన్ ,తండ్రి పేరు పఠాన్ ఖాసీంఖాన్, వయసు 26, డోర్ నెంబర్ 6-71, టి.బి.రోడ్డు, కలికిరి, కలికిరి మం డలం, అన్నమయ్య జిల్లా ,ఆంధ్రప్రదేశ్. 02-08-2023వ తేదీ సాయంత్రం నేను పీలేరు నుండి కలికిరికి ప్రయాణి స్తుం డగా నా పాస్‌పోర్ట్ పోయినది.దొరికిన వారు క్రింది నెంబరుకు తెలుపగలరు.

సెల్:౦91 63031 54377

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జన్మదినోత్సవం

---- సాహిత్యం సామాజిక మార్పుకు సంఘ అభ్యుదయానికి తోడ్పడుతుంది ----

విశాలాంధ్ర-పీలేరు: తిరుపతిరోడ్‌లోని స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో తెలుగు భాషా సమితి సారధ్యంలో జరిగిన నవయుగ కవి చక్రవర్తి బిరుదాంకితుడు యైన గుర్రం జాషువా జన్మదినోత్సవం ఇన్ ఛార్జ్ ప్రధానా చార్యులు శ్రీమతి రేవతి అధ్యక్షతన జరిగింది.ముందుగా గుర్రం జాషువా పటమునకు పూల మాలలు సమర్పించి కొబ్బరికాయలతో పూజించారు. ఈకార్యక్రమునకు ముఖ్య అతిథిగా విచ్చే సిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సరస్వతి శ్రీరాములు రాజు గుర్రం జాషువా జన్మదినోత్స వమును ఉద్దేశించి విద్యార్థులతో మాట్లాడుతూ గుర్రం జాషువా సమాజ సంస్కరణకోసం అధునిక సాహిత్యాన్ని అనేక పద్య గద్యాదులతో రచించాడని, ఆయన సాహిత్యం సంఘంలోని ప్రతి వ్యక్తిని చైతన్యవంతుడిని చేయడానికి మరియు మానవుని అభివృ ద్ధికి, మూలకారణమని తెలియచేస్తూ జాషువా పై అనేక కవితలు పాటలు వ్రాసి వినిపించాడు. తరువాత తెలుగు భాషా సమితి అధ్యక్షుడు మరియు విద్యాశాఖ సీ.ఆర్.పీ జలకనూరి మురళీ ధర్ రాజు మాట్లా డుతూ జాషువా తన బాల్యములో పేదరికం, అంటరానితనం ముతో ఆనాటి సమాజంతో పడిన దుర్భరజీవితమే తన సాహిత్యానికి మూలకారణమని, ఆ సాహిత్యమే ప్రజలచేత ప్రభు త్వంచేత అంబారిపై ఊరేగించి కనకాభిషేకం తోపాటు గండపెండేరమును తొడిగించుకొ న్నా డని, ఆయన రాసిన క్రీస్తు చరిత్ర కి రాష్ట్రపతి చేత పద్మభూషన్ బిరుదుతో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్‌ను అందుకున్నాడని తెలియచేస్తూ, తాను వ్రాసిన మరో కావ్యమైన ,"గబ్బి లం"లో పేదరికాన్ని, అంటారాని తనమును నిర్మూలించే సందర్భములోని పద్యాలన ఆలపిం చారు.తరువాతపాఠశాలతరపునసరస్వతిశ్రీరాములు రాజు ను మరియు జలకనూరి మురళీధర్ రాజునుసన్మానించారు.తరువాతవిద్యార్థులకి తీపి మిఠాయిలు పంచి పెట్టారు. ఈకార్యక్రమ ములో ఎస్.ఆర్.డిగ్రీకళాశాలతెలుగుఅధ్యాపకుడుకోటాబాలాంజనేయులు,వి.యస్.ఎన్ సిద్ధార్థపాఠశాలతెలుగుఉపాధ్యాయుడుఎన్.చలపతినాయుడుమరియు విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతి,స్నేహశీలత,సోదర భావం,సందేశాన్ని ఇచ్చిన మహెూన్నత వ్యక్తి మహమ్మద్ ప్రవక్త : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పీలేరు: ప్రపంచ శాంతికోసం శాంతి, స్నేహశీలత, సోదరభావం మానవాళికి సందేశాన్ని ఇచ్చిన మహెూన్నత వ్యక్తి మహమ్మద్ ప్రవక్త అంటూ పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి పేర్కొన్నారు.ఇతరుల పట్ల సహనం, కరుణ,ఐక్యతను పెంపొందించు కోవా లని, మహమ్మద్ ప్రవక్త మార్గంలో నడవాలని ఆకాంక్షించారు.పీలేరు నియోజకవర్గ ముస్లిం సోదర సోదరీ మణులు, వారి కుటుంబ సభ్యులకు ఈద్ ఏ మిలాద్ ఉన్ నబీ పర్వదిన శు భాకాంక్షలు తెలిపారు.పీలేరు యువ సర్పంచ్ హబీబ్ బాషా స్థానిక కడప రోడ్డులో ఉన్న యం. యం. ఫంక్షన్ హాల్ నందు ఈద్ - మీలాద్ - జులూస్ సందర్భంగా ఆయన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ. శ్రీనాథ్ రెడ్డి,జీవీ. రాకేష్ రెడ్డి, జడ్పీటీసీ రత్నశేఖర్ రెడ్డి, మండల కన్వీనర్ దండు జగన్మోహ నరెడ్డి, సచివాలయ కన్వీనర్,వైసీపీ యువ నేత సునీల్ రెడ్డి,ఎంపీ.పి.ఆర్.ఓ ఉదయ్ కుమార్, మునీర్ ,అబీద్, వైస్.ఎంపీపీ, హరిత వెంకటరమణ, పెద్దోడు,ఎంపీటీసీలు, వార్డు సభ్యులు,ముస్లిం మత గురువులు, వైసీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుష్పచారం, ఆరోపణలపై బాధాకరం

---- పీలేరు సీనియర్ వైసీపీ నాయకులు షామియానా షఫీ ----

విశాలాంధ్ర-పీలేరు: తనపై దుష్ప్రచారం బాధాకరమని పీలేరు వైసిపి సీనియర్ నాయకులు షేక్ షఫీ అలియాస్ షామియానా షఫీ అన్నారు.స్థానిక పట్టణం, ప్రకాశం రోడ్ లోని తన షామియానా దుకాణం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను గత 35 సంవత్సరాలుగా పెద్దిరెడ్డి కుటుంబానికి విధేయుడునని భవిష్యత్తులో కూడా వారి అడుగుజాడల్లోనే నడుస్తానని అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారికి ఎదురొడ్డి సర్పంచ్ గా పోటీ చేశాను వారి అధికారంలో బలముతో వారి అభ్యర్థిని గెలిపించుకున్నారు. 2014లో, 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ పార్టీ తరఫున కృషి చేశానని అన్నారు. పార్టీకి తను చేస్తున్న సేవకు, విధేయతను గుర్తించిన పెద్దాయన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి ఈసారి జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తన భార్య వైస్ సర్పంచి అయిన నేపథ్యంలో రెండున్నర సంవత్సరాల తర్వాత సర్పంచిగా నియమిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కానీ అది వారి ఇష్టం.కానీ కొంతమంది తాను డబ్బుకు లొంగిపోయి తన భార్యకు సర్పంచి పదవిని వదులుకున్నానని దుష్ప్రచారం చేస్తున్నారు. సమాజంలో తనను అగౌరవప రుస్తున్నారు. ఇది తనకు మనోవేదనకు గురి చేసిందని ఆవేదన చెందారు.ఈ రోజు ప్రవక్త పుట్టినరోజు మరియు మరణించిన రోజు అయిన ఈద్-ఏ-మిలాద్-ఉన్-నబీ పవిత్రమైన రోజు ప్రమాణం చేస్తున్నాను తాను ఎవరి నుండి డబ్బు తీసుకోలేదు. తన స్వార్థం కోసం ఎవ రిని ప్రలోభ పెట్టలేదు. అలా ఎవరైనా నిరూపించిన ఎడల తాను ఎటువంటి శిక్షకైనా సిద్ధమని రాజకీయాలనుండి శాశ్వతంగా పూర్తిగా వైదొంగతానని అన్నారు.

విశాఖపట్నంలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశాలకు అన్నమయ్య జిల్లా నుండి హాజరుకానున్న జిల్లా అధ్యక్షులు టిఎల్ వెంకటేష్

విశాలాంధ్ర-పీలేరు: అక్టోబర్ 4, 5 తేదీలలో విశాఖపట్నంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశాలు జరుగుతాయని ఈ సమావేశానికి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ జిల్లాల ముఖ్య నేతల తో పాటు ముఖ్యఅతిథిగా ఏఐవైఎఫ్ జాతీయ నాయకులు గుజ్జల ఈశ్వరయ్య హాజరయ్యే సమావేశాలకు అన్నమయ్య జిల్లా నుండి జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న టి ఎల్ వెంకటేష్ కు గురువారం ఆహ్వానం అందింది ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి ఎల్ వెంకటేష్ మాట్లాడుతూ రెండు రోజులపాటు జరుగుతున్న సమావేశాల్లో మొదటిరోజు ఎందరికో ప్రత్యక్ష ఉద్యోగాలు ఇచ్చి పరోక్షంగా లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను లోపలికి వెళ్లి రాష్ట్రవ్యాప్తంగా 30 మంది యువజన నాయకులు చూడటానికి రాష్ట్ర నాయకత్వం ఏర్పాటు చేసిందన్నారు మరుసటి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగుల భర్తీ కోసం ఆందోళనలు, విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, ఆన్లైన్ యాప్లతో నష్టాలు, తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొం దించుకోవడం జరుగుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్ -నబి వేడుకలు

విశాలాంధ్ర - కమలాపురం : స్థానిక దర్గా- ఏ- గఫారియా ఖాద్రీ ఆవరణంలో దర్గా పీఠాధిపతులు భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్ -నబి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పీఠాధిపతి నివాసం నుంచి తీసుకువచ్చిన పూల చాదర్లను స్వామివార్ల మజార్లపై సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతేహా నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన దాదాపు 100కు పైగా వస్తువులను ప్రదర్శనలో ఉంచారు భక్తులు వాటిని చూసేందుకు ఆసక్తి చూపారు. భక్తులను ఉద్దేశించి పీఠాధిపతి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జననం మరణం ఒకేరోజు జరగాయని ఆ రోజునే మనమందరం మిలాద్-ఉన్- నబీగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు తెలిపారు. అంతకుముందే దర్గాలో జెండాను ఎగరవేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం వైసీపీ యువనేత ఇస్మాయిల్ ఆధ్వర్యంలో దర్గా ఆవరణం నుండి మూడు రోడ్ల కూడలి వరకు యువత భారీ ఎత్తున బైక్ ర్యాలీని నిర్వహించారు. అదేవిధంగా రాత్రి భక్తులకు మరోసారి గఫారియా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో దస్తగిరి స్వామి మౌలానా స్వామి ప్రత్యేకతను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మహిళలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రెండు చెరువులకు నీరు మళ్లింపు

విశాలాంధ్ర-కమలాపురం : మండల పరిధిలని లేటపల్లెగ్రామసమీపానపాపాఘ్ని నదిలో నుంచి కాలువ ద్వారా కమలాపురం చదిపిరాళ్ల రెండు చెరువులకు నీరు మళ్ళించారు. గురువారం ఎమ్మెల్యే పి.రవి రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి నాయకులు పి.వి. కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జెసిబి తో పాపాఘ్ని నదిలో ఇసుక కట్టలు వేసి కట్టుకొమ్మ కాలువ ద్వారా చదిపిరాళ్ల చెరువుకు కమలాపురం చెరువుకు నీరు మళ్లించారు. దీనిద్వారా చదిపిరాళ్ల చెరువు కింద 500 ఎకరాలు కమలాపురం చెరువు కింద 1000 ఎకరాలకు సాగుకు నీరు ఉపయోగపడనుంది. ప్రతి సంవత్సరం ఈ చెరువులకు నీరు అందడం ద్వారా రైతులు భూములను సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని దీంతో సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్న రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్: ఉప ముఖ్యమంత్రి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని, పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా అన్నారు. స్థానిక ఉపముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్.బి. అంజాద్ భాష నివాస క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద మంజూరైన రూ 10 లక్షల ఏల్ ఓ సిలు, రూ.9 లక్షల 30 వేల చెక్కులను మొత్తం రూ. 19 లక్షల 30 వేలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాష మాట్లాడుతూ.... పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రం ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి పేద వాడిని ఆదుకోవడానికి ఆరోగ్యశ్రీ పథకం వర్తించని జబ్బులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పేదప్రజలకు ఆర్థిక సహాయం అందించి నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.కడప నగరంలో ఈ నాలుగేళ్లలో రూ 8 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయం కింద ఇంత పెద్ద మొత్తంలో పేద ప్రజలకు సహాయం అందించడం గొప్ప విషయం అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఆరు మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద లివర్ ట్రాన్స్ ప్లాంట్ చికిత్సకు దాదాపు ఒక్కరికి 30 లక్షలు పైగా సాయం అందించడం జరిగిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ ని గత పాలకుల నిర్లక్ష్యం చేసారని ఆయన తనయుడు జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి ఆరోగ్యశ్రీకి పెద్దపీట వేస్తూ 1000 రూ దాటిన ప్రతి ఒక్కరికీ,అలాగే దాదాపుగా 3400 పైగా సేవలను, ఆరోగ్యశ్రీ పథకం కిందకి చేర్చారన్నారు. రాష్ట్రంలో ఐదు లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న పేద,మధ్యతరగతి ప్రజలకు దాదాపు 80% మందికి పైగా ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు.రాష్ట్ర ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే ఇలాంటి ముఖ్యమంత్రి కలకాలం ఉండాలని ప్రజలు ఆశీస్సులు అందించాలని ఆకాంక్షించారు. తొలుత కడప నగరానికి చెందిన నూనె రమేష్‌కి లీవర్‌ట్రాన్స్ ప్లాంటేషన్ శాస్త్ర చికిత్స కొరకు వారి కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.10 లక్షల ఆర్థిక సహాయం క్రింద ఎల్ ఓ సి ని, నగరానికి చెందిన భాస్కర్ రెడ్డి, రామయ్య, హాజీరా బేగం లకు ఆరోగ్య చికిత్స లకు రూ.9 లక్షల, 30 వేల చెక్కులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజాద్ భాష చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇందుకు లబ్ధి పొందిన లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కలకాలం ఆయనే ముఖ్యమంత్రిగా ఉండాలని, అలాగే ఉపముఖ్యమంత్రి ఎస్ బి అంజాద్ భాష కూడా భవిష్యత్తులో ఉపముఖ్యమంత్రిగా పదవులను పొంది పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవలందించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బంగారు నాగయ్యయాదవ్, నాయకులు నరపురెడ్డి సుబ్బా రెడ్డి, తోట కృష్ణ, కార్పొరేటర్లు శ్రీరంజన్ రెడ్డి, జఫ్రుల్ల, జయ చంద్రారెడ్డి, శివా నాయక్, గోపాలకృష్ణ, వైఎస్సార్సీపి నాయకులు, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

బిజెపి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి: బిజెపి నాయకులు

విశాలాంధ్ర -రాజంపేట: బిజెపిని సంస్థాగతంగా బలోపేతం చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతు గుంట రమేష్ నాయుడు అన్నారు. గురువారం బిజెపి కార్యాల యంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అవినీతి అక్రమాలను ఇంటింటికి తీసుకెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు.వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే దిశగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. పార్టీని సంస్థాగతంగా బూత్ స్థాయి వరకు బలోపేతం చేసుకుంటూ కొత్తవారిని పార్టీలో చేర్చుకొని వైసీపీ ప్రభుత్వాన్ని అవినీతి అక్రమాలు దోపిడీలు ప్రజలకు ఎన్నికల ముందర వారు ఇచ్చిన వాగ్దానాలు అవి ఎంతవరకు నెరవేర్చారు లేదా అనే అన్ని విషయాల పైన ఇంటింటికి బిజెపి కార్యకర్త వెళ్లి ప్రజలను జాగ్రత్తపరిచి వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి అందరూ తమ వంతు ప్రయత్నం చేయాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి జీకే నాగరాజు, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్టుపోగుల ఆదినారాయణ, పట్టణ ఉపాధ్యక్షులు తోట నగేష్, బిజెపి పట్టణ కార్యదర్శి పి.రమణ, బిజెపి నాయకులు చొప్పరవి శంకర్ రెడ్డి, బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు మాకం రవి, యువమోర్చా పట్టణ అధ్యక్షులు బొజ్జ అభిరామ్ ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో రెండు సీలింగ్ ఫ్యాన్స్, శానిటరీ ప్యాడ్స్ పంపిణీ

విశాలాంధ్ర -కమలాపురం : మదర్ థెరీసా సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నియోజవర్గ కేంద్ర పరిధిలోని చింతకొమ్మ దిన్నె మండలంలోని కృష్ణాపురం సమీపంలోని స్థానిక ప్రసంగం వినికిడి లోపం ఉన్న ఆశా నిలయం పాఠశాలలో ఉన్నటువంటి పిల్లలకు ఉద యం సీలింగ్ ఫ్యాన్స్ మరియు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కె దర్బర్ వల్లీ ఆయన సతీమణి చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ పిల్లల మధ్య ఈరోజు గడపడం చాలా సంతోషకరమనికొనియాడారు. అలాగే ఆశ నిలయంకి ఏదైనా అవసరమైతే మాకు తోచిన సహాయంచేయడంజరుగుతుందని వారు తెలిపారు. అనంతరం మదర్ థెరీసా సేవా సమితి ట్రస్ట్ చైర్మన్ జూటురు విజయ్ కుమార్ మాట్లాడుతూ దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామని దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.. ఈ కార్యక్ర మంలో ప్రిన్సిపల్ సిస్టర్జ్యోతిషాఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు..

పలు గ్రామాలలో టిడిపి నాయకులు నిరసనలు

విశాలాంధ్ర-రామాపురం: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టులు పై మండలంలోని పలు గ్రామాల్లో రాయచోటి నియోజ కవర్గం టిడిపి ఇన్చార్జ్ ఆర్ రమేష్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు రామాపురం టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ చింతపించల రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో పలు గ్రామాలలో నిరసన కార్యక్రమాలు వ్యక్తం చేశారు. మండలంలోని కసిరెడ్డి గారిపల్లె పంచాయతీ సూర్యనారాయణపురం. గువ్వలచెరువు గ్రామంలో చిట్లూరు పంచాయతీ కస్పా. పప్పి రెడ్డిగారిపల్లి. బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లి. పోత్తుకూరు పల్లి. గ్రామాల్లో గురువారం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామాల్లోనీ ప్రతి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు అక్రమ అరెస్టు లపై ప్రజలకు కరపత్రాల ద్వారా తెలియజేశారు. గ్రామాలలో బాబుతోనే నేను సైతం అంటూ సంతకాలు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో ఎలాంటి అవినీతి జరగలేదన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఉన్నాయనీ మన రాష్ట్రంలో కూడా నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారని అన్నారు. రాష్ట్రంలోనే నిరుద్యోగులైన యువతీ యువకులు రాష్ట్రంలో కాకుండా ఇతర దేశాల్లో కూడా ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. తెలుగు ప్రజలు వారందరూ బాబుకు మద్దతుగా నిలిచి నిరసన గళం పట్టారన్నారు. నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తే వైసిపి ప్రభుత్వం అరెస్టులు చేస్తుందన్నారు. నైపుణ్య శిక్షణ కేంద్రాలతో మన బిడ్డలకు ఉద్యోగాలు కల్పించడం నేరమా అని అన్నారు. 35 దేశాలలో తెలుగువారు అందరూ బాబుకు మద్దతుగా నిలసి నిరసన గళం చేపడుతున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు తన కుటుంబం కన్నా ప్రజలు ముఖ్యమని పగులు. రాత్రులు. కష్టపడడం తప్ప ప్రజా సమస్యల కోసం రోడ్ ఎక్కి ప్రభుత్వం నిలదీయడం అపరాధమా అవినీతులపై జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం పాపమా అని ఆయన ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిన చంద్రబాబునాయుడునీ వెంటనే విడుదల చేయాలని టిడిపి నాయకులు కార్య కర్తలు పెద్ద ఎత్తున గ్రామాల్లో నిరసనలు చేపట్టారు. ముఖ్యంగా రాజకీయ కక్షలతోనే చంద్రబాబు నాయుడు పైన అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తేయాలని ఆయన అన్నారు. ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి నాయకులను కార్యకర్తలను భయభ్రాంతులను చేస్తున్నారని ఈ అక్రమ కేసులకు ఎవరు భయపడరని తాము బాబుతోనే నేను సైతం అనీ అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నరేంద్రకుమార్‌రెడ్డి.సహదేవరెడ్డి.జయరాంరెడ్డికడవకోటిసుబ్బరాయుడు. రాజా నాయక్. వెంకటరమణ. వేంపల్లి గంగయ్య. దాసప్ప .వెంకటయ్య. నాగేశ్వరరావు. హరి ప్రసాద్ అజమ్ .భవనం వెంకటరామి రెడ్డి. గణేష్. నరహరి. వస్త్రం నాయక్. రాంబసి రెడ్డి. నీలకంఠారెడ్డి. సుబ్బయ్య. సుభహాన్. పార్టీ నాయ కులు. కార్యకర్తలు. మహిళలు. ప్రజలు పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి: ఎస్సై

విశాలాంధ్ర-గాలివీడు:ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ వెంకట శివకుమార్ సూచించారు. గురువారం మండలకేంద్రంలోని రాయచోటి కదిరి ప్రధాన రహదారిపై వాహనదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ప్రమాదాలు నివారించు కోవాలంటే హెల్మెట్ ధరించా లన్నారు. రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలు తగలకుండా ఉండేందుకు హెల్మెట్ ఎంతో సహాయపడుతుందని తద్వారా ప్రాణాపాయం నుండి బయట పడేందుకు అవకాశాలు ఉన్నాయని తెలి పారు.ఈ మధ్యకాలంలో ప్రమాదాలలో మరణించేవారు ఇంచుమించు హెల్మెట్ లేకపోవడం వల్ల, మద్యం సేవించి వాహనాలు నడపడం,రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని దీనిని గుర్తించి ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు.ఈకార్యక్రమంలో ఏఎస్సై అంజిరెడ్డి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజధాని పేరుతో అనేక అక్రమాలు

వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి అప్జల్ ఖాన్



విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : అమరావతి రాజధాని పేరుతో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు లోకేష్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి అప్జల్ ఖాన్ ఆరోపించారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు విషయంలో లెక్కలేనన్ని అక్రమాలు చోటు చేసుకు న్నాయన్నారు. వీటన్నింటినీ సిఐడి గుర్తించిందన్నారు .అసైన్డ్ రైతుల నుంచి భూములను బలవ ంతంగా లాక్కున్నారని, వారి పేరుతో వచ్చిన ఫ్లాట్లను కూడా వీరే కాజేశారన్నారు. ఇందులో హెరిటేజ్ ,నారా యణ లింగం నేని రమేష్ లకు లబ్ధి చేకూర్చాలని ,అందుకు ప్రతిఫలంగా కరకట్టపై బంగ ళాను చంద్రబాబుకు బహుమతిగా ఇచ్చారన్నారు. రాజధాని పేరు చెప్పి వందల ఎకరాల భూములను టిడిపి నాయకులు అప్పనంగా దోచుకున్నారన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలు 120 కి పైగా సిఐడి సేకరించింది అన్నారు. ప్రజల సొమ్ము దోచుకున్న వారికి శిక్ష పడే వరకు ప్రభుత్వం విశ్రమించదున్నారు. చంద్రబాబు అరెస్టుపై ఎవరికి సానుభూతి లేదని, పైగా అవినీతి సొమ్మును రాబట్టాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు రాబోయే ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి 175 స్థానాలకు 175 సీట్లు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

పాస్ పోర్ట్ మంజూరులో తీవ్ర జాప్యం

- అదికారుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భాదితులు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గ అసెంబ్లీ కేంద్రంలోని హెడ్ పోస్టాఫీసు ప్రాంగ ణంలో ఉన్న పాస్ పోర్ట్ కేంద్రంలో పాస్ పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకుని 2 నెలలు దాటినా ఇంతవరకు పాస్ పోర్ట్ రాకపోవ డంతో భాదితులు పాస్ పోర్ట్ అదికారుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇతర దేశాలకు వెళ్లే వారి పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది.రైల్వేకోడూరు పాస్ పోర్ట్ కేంద్రంలో రోజుకు సుమారు 60 అప్లికేషన్లు వస్తున్నట్లు సమాచారం.40 పాస్ పోర్ట్ అప్లికేషన్స్ దాటితే ఇద్దరు సిఎస్ఇ ఉండాలని తెలిసింది.ఒక అదికారి ద్వారానే పనులు చేయిస్తున్నారని అరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ ఉన్న వెరిఫికేషన్ అదికారి జూలై నెలలో బదిలీ అయ్యారని తెలుస్తోంది.ఇప్పటి వరకు వెరిఫికేషన్ అదికా రిని నియమించ కపోవడం పాస్ పోర్ట్ హెడ్ ఆఫీస్ అధికారుల నిర్లక్ష్య పనితీరే నిదర్శనమని విమ ర్శలు వినిపిస్తు న్నాయి.పాస్ పోర్ట్ హెడ్ ఆఫీస్ అధికారులు వినియోగదారుల పాస్ పోర్ట్ దరఖాస్తులో అసంపూర్ణంగా ఉన్నాయని నెపంతో పాస్ పోర్ట్ మంజూరులో చాలా జాప్యం చేస్తున్నారని భాదితుల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి.రైల్వేకోడూరు పాస్ పోర్ట్ కార్యాలయంలో వెరిఫికేషన్ అదికారులను నియమించక పోవడం వలన ఈ సమస్య ఉత్పన్నమవుతుంది.పాస్ పోర్ట్ నిబంధన ప్రకారం ఇక్కడ పాస్ పోర్ట్ కార్యాలయంలో ఇద్దరు కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ అధికారులు (సిఎస్ఇ) ఉండాలి, కానీ 2018 నుండి ఒకరే విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.వెరిఫికేషన్ అధికారి మరొకరు ఉండాలని భాధితులు పేర్కొంటున్నారు.పాస్ పోర్ట్ వెరిఫికేషన్ కోసం వచ్చే వారికి, పాస్ పోర్ట్ దరఖాస్తు చేసుకుని 2 నెలలు దాటినా ఇంకా ఎందుకు రాలేదు అని అడిగే వారికి సమాధానం చెప్పలేక ఇక్కడ ఉన్న ఒకే ఒక అధికారి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అర్హత సాధించి ఉన్నత విద్యకోసం ఇతర దేశాలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధి కోసం విదేశాలకు వెళ్లే వారు నష్ట పోయే ప్రమాదం ఏర్పడింది. 2 నెలలుగా పాస్ పోర్ట్ రాని భాదితులు అందరూ రైల్వేకోడూరు పాస్ పోర్ట్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేయడానికి యుద్ధప్రాతిపదికన రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ధర్నా చేయడానికి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అనుమతి కోసం వెళ్లారు.వారి నుండి అనుమతి వచ్చిన వెంటనే రైల్వేకోడూరు పాస్ పోర్ట్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలుస్తోంది.ఇప్పటికైనా పాస్ పోర్ట్ హెడ్ ఆఫీస్ అధికారులు స్పందించి రైల్వేకోడూరు పాస్ పోర్ట్ కార్యాలయంలో వెరిఫికేషన్ అదికారులను నియమించి పాస్ పోర్ట్ లు సకాలంలో అందించి సహకరించాలని భాదితులు కోరుతున్నారు.

విదేశీయుల బస వివరాలు ఫారం-సిలో తెలియజేయాలి : ఎస్పి

విశాలాంధ్ర - కడప : వివిధ దేశాల నుంచి వచ్చిన విదేశీయులకు జిల్లాలో ఆశ్రయం కల్పించి నవా రు వారి వివరాలు విధిగా ఆన్ లైన్ ద్వారా బ్యూరో అఫ్ ఇమిగ్రేషన్ పోర్టల్ లోని ఫారం -సి నందు నమోదు చేయాలని జిల్లా ఎస్.పి సిద్దార్థ్ కౌశల్ ఐ.పి.ఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పుణ్యక్షేత్రాలు, వైద్య, ఇంజనీరింగ్ కళాశాలలు, అనాధ శరణాల యాలు మరియు టూరిజం ప్రాంతాలు వుండటంతో వివిధ దేశాల నుండి విదేశీయులు జిల్లాకు వస్తుంటారని, అలాంటి వారికి స్థానికంగావున్న ప్రజలు, లాడ్జీలు, అతిధి గృహాలు, రిసార్ట్స్ వంటి వాటిల్లో ఆశ్రయం కల్పిస్తే సెక్షన్ 16(7) ఆఫ్ ఫారినర్స్ అమెండ్మెంట్ ఆర్డర్ 2016 ప్రకారం, ఫారం సి నందు నమోదు చేయవలెను. సమాచారం ఇవ్వకుంటే సెక్షన్ 14 అఫ్ ఫారినర్స్ ఆక్ట్ 1946 మేరకు శిక్షార్హులని, సంబధితవ్యక్తికి ఐదేళ్ళపాటు జైలుశిక్ష వుంటుందని జిల్లా యస్.పి సిద్ధార్థ్ కౌశల్ గారు సూచించి నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని విదేశీయులకు ఆశ్రయం ఇచ్చినవారు /కల్పించినవారు తప్పకుండా 24 గంటలలోపు సమాచారం అందించాలని, ఇతర వివరాలకు జిల్లా ఎస్.పి క్యాంపు కార్యాల యంలో ప్రత్యేక బ్రాంచి విభాగం అధికారి అయిన కె. అశోక్ రెడ్డి, ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్, డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్, కడప, సెల్.నెం. 9121100652) ని సంప్రదించాలని యస్.పి సిద్ధార్థ్ కౌశల్ సూచించారు.

వివాహిత ఆత్మహత్య

విశాలాంధ్ర-చెన్నూరు : స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని ఖాదర్‌ఖాన్ కొట్టాలు గ్రామంలో వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు ఖాదర్‌ఖాన్ కొట్టాలలో నివాసం ఉండే రాయచోటి సుబ్బలక్ష్మి (38) తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు.మృతురాలి పుట్టినిల్లు ఆలంఖాన్‌పల్లె కాగా సుమారు 20సంవత్సరా క్రితం ఖాదర్‌ఖాన్ కొట్టాలుకు చెందిన పెద్ద రజుతో వివాహమైందన్నారు. వీరు బేల్దారి పనులు చేసి జీవనం సాగిస్తుండేవారన్నారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారని అయితే భర్త ప్రతి రోజు మద్యం సేవించి హింసించే వారని అత్తమామలు కూడా తన భర్తను సమర్థించడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగన్ కుట్రలు చేదిస్తాం ... వైకాపా కుతంత్రాలను తరిమేస్తాం

16వ రోజు రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న బత్యాల

విశాలాంధ్ర -రాజంపేట: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడిని రాజకీయంగా ఎదుర్కోలేక వైకాపా ప్రభుత్వం కక్ష పూరితంగా అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి రిమాండ్కు పం పించిన ముఖ్యమంత్రి కుట్రలను చేదిస్తాం అలాగే వివిధ ప్రాం తాల్లో వైకాపా నాయకులు చేస్తున్న కుతంత్రాలను తరిమేస్తామని మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజంపేట నియోజకవర్గ ఇంచార్జ్ గౌరవ,,శ్రీ బత్యాల చంగల్ రాయుడు దుయ్యబట్టారు .చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా రాజంపేటలో బత్యాల ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా గురువారం 16వ రోజు జరిగిన రిలే నిరాహార దీక్షలకు ఆయన రాజంపేట పట్టణంలోని మరియు సిద్ధవటం, సుండుపల్లి, నందలూరు మండలాల నుండి టిడిపి శ్రేణులతో కలిసి హాజరై సంఘీభావం తెలిపారు.జనసేన పార్టీ నాయకులు పార్లమెంట్ సమన్వయకర్త రామా శ్రీనివాసులు ఆధ్వర్యంలో జనసేన నాయకులు కార్యకర్తలు హాజరై రిలే నిరాహార దీక్షకు మద్దతుగా సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలన దిగజారు డుతనానికి నిదర్శనమని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో వేల అక్రమ కేసుల్లో మా నాయకుడిని ఇరికించి మరోసారి అధికారంలోకి రావాలనుకోవడం సీఎం జగన్ కు కలగానే మిగులుతుందని అన్నారు.వచ్చే ఎన్నికల్లో వైకాపా అవినీతి అక్రమాలపై ప్రజలు ఓటు అనే ఆయుధంతో తగిన గుణపాఠం చెప్పి తరిమి తరిమి కొట్టి ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని ఇది వైకాపా నాయకులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గుర్తించుకోవాలని తెలిపారు. అమరావతి రింగ్ రోడ్డు విషయానికొస్తే అక్కడ రోడ్డు వేయలేదని ప్రతిపాదనలకే పరిమితమయ్యాయని ఆ ప్రతిపాదనలో కూడా అక్రమంగా లోకేష్ బాబుపై 14 ముద్దాయిగా ఇరికించి కేసు నమోదు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఆరోపించారు.మా ప్రాంతంలో కూడా నేను రోడ్డు వేస్తానంటే కొంతమంది అడ్డు తగలారని అయినప్పటికీ నేను ఆ ప్రాంతం అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో రోడ్డు వేశానని ఆతర్వాత ఆ ప్రాంత ప్రజలు ఆరు నెలలు తనతో మాట్లాడలేదని తెలిపారు. ఆరు నెలల తర్వాత ఆప్రాంతం అభివృద్ధి చెందినా వెంటనే ఆ ప్రాంతవాసులు వారే స్వ యంగా తనను ఆహ్వానించి ఆరు పొట్టేలు కోసి తనకు ప్రత్యేక విందును ఏర్పాటు చేసి అభినందించారని తెలిపారు.ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే ముందుగా అక్కడ రోడ్లు వేయాల్సి వస్తుందని తెలిపారు. అందులో భాగంగానే అమరావతి అభివృద్ధి లో భాగంగా రింగ్ రోడ్డుకు అప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం లో ప్రతిపాదనలు పంపారని తెలిపారు. మీరు ఎన్ని కేసులు పెట్టినా రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల మద్దతుతో భారీ ఓట్ల మెజారిటీతో విజయవంతంగా గెలుపొంది, ముఖ్యమంత్రి సీటును కైవసం చేసుకుంటారని తెలిపారు. సుప్రీంకోర్టులో చంద్రబాబుకు అనుకూలంగా తీర్పు రావాలని కేసు నుంచి ఆయన త్వరగా బయటపడాలని మీలాద్-ఉన్-నభీ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నామన్నారు.